RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

నిజం మా నైజం

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ సంపుటి : 13 సంచిక : 117 గురువారం, ఆగష్టు 21, 2025, పేజీలు - 8 వెల : 3/-




# బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ, ఆగస్టు 20 : (ఆగస్టు 22) ప్రధాని నరేంద్ర మోదీ బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పర్యటిస్తారు. ఉదయం 11 గంటలకు బీహార్‌లోని గయలో దాదాపు రూ.13,000 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత, గంగా నదిపై ఆంటా–సిమారియా వంతెన ప్రాజెక్టును సందర్శించి ప్రారంభిస్తారు.బీహార్‌లో ప్రధానమంత్రి –31లో 8.15 కి.మీ. పొడవైన ఆంటా – సిమారియా వంతెనను ప్రారంభిస్తారు. దీంతోపాటు, గంగా నదిపై రూ. 1,870 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన 1.86 కి.మీ. పొడవైన 6 లేన్ల వంతెన కూడా ఉంటుంది. ఇది పాట్నాలోని మోకామా – బెగుసరాయ్ లను డైరెక్ట్‌గా కలుపుతుంది అంతేకాకుండా, ప్రధానమంత్రి మోదీ –31లోని దాదాపు రూ. 1,900 కోట్ల విలువైన నాలుగు లేన్ల భక్తియార్‌పూర్ నుండి మోకామా సెక్షన్‌ను ప్రారంభిస్తారు. ఫలితంగా ఈ ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయి. అటు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుంది.బీహార్‌లో విద్యుత్ రంగ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూ, ప్రధానమంత్రి దాదాపు రూ.6,880 కోట్ల విలువైన బక్సర్ థర్మల్ పవర్ ప్లాంట్ (660)ను ప్రారంభిస్తారు. ఇది విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుతుంది. ఇంధన భద్రతను మెరుగుపరుస్తుంది. అంతేకాక, ఈ ప్రాంతంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీరుస్తుంది.మరో వైపు, ఆరోగ్య మౌలిక సదుపాయాలకు ఊతం ఇస్తూ, ప్రధాని మోదీ ముజఫర్‌పూర్‌లో హోమి భాభా క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. ఈ కేంద్రంలో అధునాతన ఆంకాలజీ వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఆధునిక ల్యాబ్, బ్లడ్ బ్యాంక్, 24 పడకల (ఇంటెన్సివ్ కేర్ యూనిట్),(హై డిపెండెన్సీ యూనిట్) ఉన్నాయి. ఈ అత్యాధునిక సౌకర్యం బీహార్, పొరుగు రాష్ట్రాలలోని రోగులకు అధునాతనమైన సరసమైన క్యాన్సర్ చికిత్సను అందిస్తుంది.పశ్చిమ బెంగాల్ పర్యటనప్రధాని మోదీ సాయంత్రం 4:15 గంటలకు కోల్‌కతాలో కొత్తగా నిర్మించిన మెట్రో రైలు సేవలను కూడా జెండా ఊపి ప్రారంభిస్తారు.



అనంతరం మోదీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.ప్రధాని మోదీ దీంతోపాటు పశ్చిమ బెంగాల్ లో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు అదే రోజు శ్రీకారం చుట్టబోతున్నారు. కోల్‌కతాలో మెట్రో రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. 13.61 కి.మీ.ల పొడవునా కొత్తగా నిర్మించిన మెట్రో నెట్‌వర్క్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఆయన జెస్సోర్ రోడ్ మెట్రో స్టేషన్‌ను సందర్శిస్తారు. అక్కడ జెస్సోర్ రోడ్ నుండి నోపారా–జై హింద్ బిమన్‌బందర్ మెట్రో సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తారు.జెస్సోర్ రోడ్ మెట్రో స్టేషన్ నుండి జై హింద్ బిమన్‌బందర్ వరకు ప్రధాని మెట్రో రైలులో ప్రయాణిస్తారు. ఈ ప్రాంతంలో రోడ్డు మౌలిక సదుపాయాలకు ప్రధాన ప్రోత్సాహకంగా, ప్రధానమంత్రి మోదీ రూ.1,200 కోట్లకు పైగా విలువైన 7.2 కి.మీ పొడవైన ఆరు లేన్ల ఎలివేటెడ్ కోనా ఎక్స్‌ప్రెస్‌వేకు పునాదిరాయి వేస్తారు. ఇది హౌరా, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలు, కోల్‌కతా మధ్య కనెక్టివిటీని పెంచుతుంది. ప్రయాణ సమయాన్ని ఆదా చేస్తుంది. ఈ ప్రాంతంలో వాణిజ్యం, పర్యాటక రంగానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

## ఆ బిల్లులను జేపీసీకి పంపే

# తీర్మానానికి ఆమోదం



న్యూ ఢిల్లీ : ప్రధాన మంత్రి గానీ, ముఖ్య మంత్రులు గానీ, మంత్రులు గానీ తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయ్యి వరుసగా 30 రోజులపాటు జైల్లో నిర్బంధంలో ఉంటే అట్టి వారిని పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే మూడు బిల్లులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మంగళవారం లోక్‌సభ లో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. కేంద్రం హడావిడిగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్య వాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావిడిగా తీసుకొచ్చారనే విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. దేశాన్ని ఓ పోలీస్ స్టేట్‌గా బీజేపీ మారుస్తోందన్నారు. బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ప్రధానమంత్రిని ఎవరు అరెస్టు చేస్తారని, ఈ బిల్లులతో దేశాన్ని పోలీసు రాజ్యంగా బీజేపీ మారుస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఆ బిల్లులను వ్యతిరేకిస్తామని, అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని బీజేపీ విస్మరిస్తోందని ఓవైసీ అన్నారు.ఒకవేళ పీఎం, సీఎం, మంత్రులు ఎవరైనా అరెస్టు అయి 30 రోజులు జైలులో ఉంటే వాళ్ల పదవి ఊడే బిల్లును ఇవాళ లోక్‌సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో విపక్షాలు ఆందోళన చేశాయి. ఓ దశలో మంత్రి అమిత్ షాపై.. విపక్ష నేతలు బిల్లు పేపర్లను చింపి విసిరేశారు.వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు లోకసభలో తీర్మానం ప్రవేశపెట్టగా ఆ తీర్మానానికి దిగువ సభ ఆమోదం తెలిపింది.అంతకుముందు మధ్యాహ్నం 2 గంటలకు లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు బిల్లుల ప్రతులను చించిపారేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండించారు. అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని చెప్పారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ నాయకులు రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో కొనసాగడం తగదని అమిత్ షా అన్నారు. అయినా ఆ మూడు బిల్లులకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సభ్యులు పట్టించుకోలేదు. దాంతో సభను ముందుగా మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో సాయంత్రం 5 గంటల వరకు వాయిదా వేశారు.

# హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలి : రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరించిన నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని అన్నారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాద్‌ను అప్పటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేసినట్లు ఆయన వెల్లడించారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్ర మానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు? : గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని పలు సంస్థలు నిర్మించారని ఆయన గుర్తు చేశారు. హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారని అన్నారు. హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోందని, మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పని చేయడం కావాలని, అమెరికాలో మన ఐటీ నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలి : రేవంత్ రెడ్డితెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చామని, రాబోయే పది సంవ త్సరాల్లో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకు ంటున్నారని, మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందామని, మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ జరగాలని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ సరైన సౌకర్యాలు లేవని, అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిస్తుందని వివరించారు.

## ఓయూ పరిధిలో లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

## రైతులను మోసం చేయడంలో


# కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే



హైదరాబాద్ : రైతులను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూదొందేనని బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఆయన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఢిల్లీకి బస్తాలు మోసే ఉన్న శ్రద్ధ.. ఎరువుల బస్తాలు తెప్పించే విషయంలో రేవంత్‌కు లేదని తేలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లే తాపత్రయం, కేసులు పెట్టేదాంట్లో ఉన్న తాపత్రయం.. సిగ్గులేకుండా తెల్లవారి లేస్తే ఇష్టం వచ్చినట్లు కేసీఆర్‌పై మాట్లాడే మాటల విషయంలో ఉండే ఆరాటం రైతులకు సాయం చేసే విషయంలో లేదు. మేం ఏం మాట్లాడినా ఒంటికాలితో మాపైకి లేచే బీజేపీ.. ఇవాళ రైతులు ఇంత అవస్థల్లో ఉంటే స్పందించడం లేదు. ఒక్క కేంద్రమంత్రి, ఒక్క ఎంపీ మాట్లాడడు. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని అడగడు. కేంద్రం ఎంత ఎరువులు ఇచ్చిందో చెప్పే పరిస్థితి కూడా కేంద్రమం త్రులు, రాష్ట్రంలోని బీజేపీకి లేకపోవడం అనేది సిగ్గుచేటు. పక్కనే ఏపీలో మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్రంలో ఉన్న మంత్రులను పట్టుకొని ఎరువులు తెచ్చుకుంటున్నరు. సీఎం 51సార్లు వెళ్లినా ఇప్పటి వరకు 51 బస్తాలు అదనంగా రాలేదు' అన్నారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకోవాలి.'ఎనిమిది ప్లస్ ఎనిమిది సున్నా అని మేం ఎప్పుడో చెప్పాం. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు, రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు ఇవాళ రైతులకు సాధించింది గుండుసున్నా. కాంగ్రెస్, బీజేపీ రైతులను, ఎరువుల విషయంలో మోసం చేయడంలో దొందూ దొందే అని తేలిపోయింది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మంచిగానే ఇస్తున్నా కానీ రాష్ట్ర ప్రభుత్వం పంచడం లేదు.. ఇక్కడికి వచ్చాక యూరియా ఏమవుతుందోనని బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ చెబుతున్నడు. అంటే బ్లాక్ మార్కెటింగ్ జరుగుతుందని చెబుతున్నవా? కాంగ్రెస్ నేతలు మధ్యలోనే యూరియా తింటున్నరని చెబుతున్నవా? తింటుంటే మీ ప్రభుత్వంఏం చెబుతున్నది మేం అడుగుతున్నం.

## కాంగ్రెస్‌కు ఝలక్ కేంద్ర బిల్లును

# స్వాగతించిన శశిథరూర్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి స్వంత పార్టీకి ఝలక్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేతలు వ్యతిరేకిస్తున్నా శశిథరూర్ మాత్రం బీజేపీ సర్కారు కొత్తగా తెచ్చిన బిల్లును స్వాగతించారు. మంచి బిల్లు అంటూ కితాబిచ్చారు. ఇవాళ లోక్‌సభలో మోదీ సర్కారు కొత్తగా మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు కస్టడీలో ఉంటే ప్రధాన మంత్రినైనా, కేంద్ర మంత్రినైనా, ముఖ్యమంత్రులనైనా పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది.ఈ బిల్లుని విపక్ష పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఈ బిల్లును క్రూరమైందిగా అభివర్ణించారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ప్రియాంక వ్యతిరేకిస్తే, అదే పార్టీకి చెందిన శశిథరూర్ మాత్రం ఇది మంచి బిల్లు అంటూ స్వాగతించారు. అంతేకాదు, ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన అంశం అన్నారు.ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపే అంశం మీద కూడా శశిథరూర్ పాజిటివ్‌గా స్పందించారు. అది ఎంతో మంచి విషయమని.. మన ప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తే కోటి రూపాయల జరిమానా


# గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ : ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్స్‌పై నిషేధం విధించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించింది. ఈ గేమ్స్ ద్వారా మనీ లాండరింగ్, ఆర్థిక మోసాలు, వ్యసనపరులుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేందుకు ఈ బిల్లు తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ బిల్లులో ఆన్‌లైన్ గేమ్స్‌కు సంబంధించిన అడ్వర్టైజ్ మెంట్లపైనా నిషేధం విధించారు. అలాంటి గేమ్స్‌కు బ్యాంక్‌లు, ఇతర ఆర్థిక సంస్థలు నిధులు సమకూర్చకుండా, నిధులు బదిలీ చేయకుండా ఆంక్షలు విధించారు .విపక్షాల ఆందోళనల మధ్య కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ ఈ బిల్లుపై సంక్షిప్త ప్రకటన చేసిన తర్వాత లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. రాజ్యాసభ ఆమోదం కూడా పొందితే ఆన్‌లైన్ బెట్టింగ్ గేములను నేరంగా పరిగణిస్తారు. మూడేళ్ల వరకు జైలుశిక్ష లేదా కోటి రూపాయల వరకు జరిమానా లేదా ఆ రెండూ విధించేలా బిల్లులో నిబంధనలు ప్రతిపాదించారు. ఆన్‌లైన్ గేమ్స్ అడ్వర్టయిజ్ మెంట్లలో భాగం పంచు కున్న వారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలు, 50లక్షల వరకు జరిమానా విధిస్తారు. గేమింగ్ ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయమున్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ళ జైలుశిక్ష, కోటి రూపాయల వరకు జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించారు.

# వన్ ఫ్యామిలీ

## వన్ ఎంట్రప్రెన్యూర్ మన లక్ష్యం: సీఎం చంద్రబాబు



అమరావతి,ఆగస్టు20: రాజధానిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక క్షణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దేశానికి విలువైన సేవలు అందించిన పారిశ్రామిక వేత్త రతన్ టాటాను గౌరవించుకోవాలనే ఏపీ ఇన్నోవేషన్ హబ్‌కు రతన్ టాటా పేరు పెట్టామని ఉద్ఘాటించారు. అత్యంత నిరాడంబర పారిశ్రామిక వేత్తగా సంపద సృష్టించిన రతన్ టాటా, తన పేరుతో టాటా ట్రస్టు పెట్టి దేశ ప్రజలకూ సేవలం దించారని నొక్కిచెప్పారు. గివ్ బ్యాక్ టు ది సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా అవలంభి ంచారని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబా బు.రతన్ టాటా ఆలోచనలను భవిష్యత్ తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ఆర్టీఐహె చ్‌ను ప్రారంభించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. (బుధవారం) అమరావతిలోని మయూరి టెక్ పార్కులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఆర్టీఐహెచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు నారా లోకేష్ , నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్, తదితరులు హాజరయ్యారు. ఆర్టీఐహెచ్‌లో వివిధ స్టార్టప్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ పరిశీలించారు. గిన్నీస్ వరల్డ్ రికార్డును సీఎం చంద్రబాబుకు గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. వన్ ఫ్యామిలీ– వన్ ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంగా ఏపీలో పనిచేయాలని నిర్ణయించుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో వన్ ఫ్యామిలీ వన్ ఐటీ ప్రొఫెషనల్ విధానంలో విజయం సాధించామని వెల్లడించారు. ఏపీలో 30 నుంచి 300 ఇంజనీరింగ్ కళాశాలలను కేవలం ఎనిమిదేళ్లలో స్థాపించామని గుర్తుచేశారు. ఐటీతో కలిసి ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ ఎకానమీని సాధించాలని చెప్పుకొచ్చారు. అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని దేవుడు తనకు ఇచ్చారని ఉద్ఘాటించారు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవాత్మకగా మారబోతున్నాయని వెల్లడించారు. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధించటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు.

## జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్

# ఎన్నికల సంఘం కీలక షెడ్యూల్




హైదరాబాద్, ఆగస్టు20 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ బై ఎలక్షన్స్ కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్‌పై ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ (బుధవారం) సమావేశమయ్యారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 17వ తేదీ వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం ఉంటుందని ఆర్వీ కర్ణన్ తెలిపారు.జూలై 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండినవారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 17వ తేదీ వరకు క్లెయిమ్స్ , అబ్జెక్షన్లు స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 25వ తేదీ లోపు క్లెయిమ్స్, అబ్జెక్షన్ల డిస్పోజల్ ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబర్ 30వ తేదీన ఫైనల్ ఓటరు జాబితా పబ్లికేషన్ ఉంటుందని తెలిపారు.

## రాజీవ్ ప్రతాప్ రూడీతో

# చేతులు కలిపిన రాహుల్



న్యూఢిల్లీ: కాన్‌స్టిట్యూషన్ క్లబ్ అఫ్ ఇండియా ఎన్నికల్లో ఇటీవల గెలుపొందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ ని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ బుధవారంనాడు అభినందించారు. ఆయనతో కరచాలనం చేరారు.పార్లమెంటు వద్ద మీడియాతో రాహుల్ మాట్లాడుతుండగా అటువైపు ప్రతాప్ రూడీ వచ్చారు. రాహుల్ వెళ్లి ఆయనను గ్రీట్ చేశారు. అనంతరం 'మా మధ్య (కాంగ్రెస్, బీజేపీ) ఇదొక అన్‌కామన్ హ్యాండ్‌షేక్. కంగ్రాట్యులేషన్స్' అని మీడియాతో మాట్లాడుతూ రాహుల్ అన్నారు. రాహుల్ అభినందించడంతో రూడీ సైతం థాంక్స్ చెప్పారు.ఇటీవల జరిగిన కాన్‌స్టిట్యూషన్ క్లబ్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్)గా రూడీ మరోసారి ఎన్నికయ్యారు. బీజేపీ నేత సంజీవ్ బల్యాన్‌పై ఆయన భారీ ఆధిక్యతతో గెలిచారు. మొత్తం 1,295 ఓట్లలో 707 ఓట్లు రూడీ గెలుచుకున్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, యూపీఏ మాజీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ సహా పలువురు మంత్రులు, విపక్ష నేతలు ఈ ఎన్నికల్లో ఓటు వేశారు.

## సత్యనారాయణ వ్రతం లో పాల్గొన్న బీజేపీ మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య దంపతులు.



**తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ :** తూప్రాన్ మండల బిజెపి అధ్యక్షులు పిట్ల పోచయ్య నివాసంలో బుధవారం ఉదయం ఘనంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించరు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారీ సలాక ఆత్రేయ శర్మ మార్గదర్శకత్వంలో సత్యనారాయణ వ్రతాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు, వ్రతం అనంతరం భక్తులు సామూహిక భోజనంలో పాల్గొన్నారు. సత్యనారాయణ స్వామి అనుగ్రహంతో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్య సమృద్ధులు కలగాలని పాల్గొన్నవారు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు బంధువులు కాలనీవాసులు, జానకి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్ లో కుక్కల బెడద



**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** మేడ్చల్ మున్సిపాలిటీలోని కిష్టాపూర్ నాలుగో వార్డులో గత కొన్ని రోజులుగా వీధి కుక్కలు రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులను నడుచుకుంటూ వెళుతున్న పాదాచారులని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి అటుగా వెళుతున్న చిన్నరిపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి ఈ ఘటనలో చిన్నారికి తీవ్ర గాయాలు కాగా మేడ్చల్ మున్సిపాలిటీలోని కిష్టాపూర్ కి సంబంధించి ఏ విషయమైనా మేడ్చల్ నగర కమీషనర్ పట్టించుకోవడంలేదని కిష్టాపూర్ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు వర్షాకాలం ఉధృతం కావడంతో బయటికి వెళ్లాలంటే భయమేస్తుంది ఇదిలా ఉంటే రోడ్డుపైకి ఎక్కితే వీధి కుక్కలు ఎప్పుడు దాడి చేస్తాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు ఇట్టి విషయమై మున్సిపల్ నగర కమిషనర్ వెంటనే కుక్కలని బ్లూ క్రాస్ కి తరలించాలని కిష్టాపూర్ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# దుండిగల్ మున్సిపాలిటీలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

**దుండిగల్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....**

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో చైన్ మెన్లదే హవా

పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహిస్తున్న చైన్ మాన్లు చలాకీలుగా మారి మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాలలో అక్రమ భవన నిర్మాణాలు, అదనపు అక్రమ అంతస్తులు, అక్రమ షెడ్డుల నిర్మాణాలకు తోడ్పాటు అందిస్తూ, అందిన కాడికి దండుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ వారి జేబులు నింపుకుంటున్నారు. వారంతా వాస్తవానికి ఔట్ సోర్సింగ్ సిబ్బంది అయినప్పటికీ అన్నీ తామై పెత్తనం చెలాయిస్తూ పబ్బం గడుపుతున్నారు.

**– పేరుకు మాత్రమే నోటీసులు... చర్యలు శూన్యం...**

మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా నిర్మించే అక్రమ భవన నిర్మాణాలు, షెడ్డులపై ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడో, ఏదైనా పత్రికల్లో ప్రచురితమైనప్పుడో తూతూ మంత్రంగా నోటీసులను జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ఎటువంటి చర్యలు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు పూర్తయ్యే వరకు నిర్మాణదారులకు సహాయ సహకారాలు అందించేందుకు భేరసారాలు కుదుర్చుకొని అక్రమ నిర్మాణాలకు చైన్ మెన్లు భరోసా ఇస్తున్నారంటే ఏ స్థాయికి వారి అజమాయిషి దుండిగల్ మున్సిపల్ లో నడుస్తుందో ఇట్టే అవగతం చేసుకోవచ్చు.

**– టౌన్ ప్లానింగ్ విభాగంలో మేమే సుప్రీం... మేము చెప్పిందే వేదం..**

మున్సిపల్ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలు, షెడ్డుల నిర్మాణాలకు సంబంధించిన ఏ సమస్య అయినా తామే పరిష్కరిస్తామని, టౌన్ ప్లానింగ్ విభాగంలో తామే సుప్రీమ్ అని చెప్పుకుంటూ అక్రమ నిర్మాణదారుల నుంచి కాసులు దండుకుంటున్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బోరంపేట్, గండి మైసమ్మ, బహుదూర్ పల్లి, దొమ్మర పోచంపల్లి, దుండిగల్, మల్లంపేట్, దుండిగల్ టెక్ మహేంద్ర, గగిల్లాపూర్ తో పాటు పలు ప్రాంతాల్లో అక్రమ భవన నిర్మాణాలు, షెడ్డులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కళ్ళ ముందే ఇంత జరుగుతున్న కాసుల కక్కుర్తి తో కనీసం వాటి వైపు కూడా చూసే ప్రయత్నం కూడా చేయలేని నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు టౌన్ ప్లానింగ్ యంత్రాంగం.

**– చైన్ మెన్ లకు అడ్డుకట్ట పడేనా...?**

మున్సిపల్ లో చైన్ మెన్లుగా విధులు నిర్వహించే సిబ్బంది మున్సిపల్ పరిధిలో వారికి కేటాయించిన ప్రాంతాలలో ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో తిరుగుతూ అక్రమ భవన నిర్మాణాలు, అక్రమ అదనపు అంతస్తులు, అక్రమ షెడ్డులను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల అనుసారం వారు నడుచుకోవాల్సి బాధ్యత వారిపై ఉంటుంది. కానీ.. దుండిగల్ మున్సిపాలిటీలో దానికి విరుద్ధంగా చైన్ మెన్లు అంతా తామై ఉన్నతాధికారులుగా చలామణి అవుతున్నారనే వాదనలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. మరి ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసే ఉంటుందని, వారి అండదండలతోనే చైన్ మెన్లు రెచ్చిపోతున్నారని మరో వాదన కూడా బలంగానే వినిపిస్తుంది. మరి ఇప్పటికైనా చైన్ మెన్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసి అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో... వేచి చూడాల్సిందే.




**– గతంలో పత్రికలలో ప్రచురించిన, ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం.....**

దుండిగల్ మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరములో ఉన్న టెక్ మహీంద్రా ఎదురుగా ఓ యజమాని దాదాపు 900 గజాల స్థలంలో భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా అధిక అంతస్తుల భవనం చేపట్టాడు. ఈ నిర్మాణం వద్ద ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే కనీసం ఫైర్ ఇంజన్ వెళ్లడానికి కూడా వెసులుబాటు లేకుండా ఉందని స్థానిక వాసులు అంటున్నారు. వీటిపై పలుమార్లు పత్రికలలో ప్రచురించిన, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న చైన్ మాన్ పై దృష్టి పెట్టి, అక్రమ నిర్మాణాలను అడ్డుకొని మున్సిపల్ ఆదాయాన్ని కాపాడాలని దుండిగల్ మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు..

## శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ప్రాంగణంలో షెడ్ నిర్మాణ భూమి పూజ లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి





**కప్రా మండల వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం లోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఫాబ్రికేటెడ్ షెడ్ నిర్మాణం కొరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ .. నూతనంగా ఏర్పడిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ఏర్పడిన మూడునెలల కాలంలోనే ఆలయంలో ఉన్న నీటి సమస్యను రూ. 1,50,000/-ల వ్యయంతో పవర్ బోరు వేయించి పరిష్కరించారు. ఆలయంలో విద్యుత్ వయరింగ్ చేసి విద్యుత్ దీపాల వెలుగులు ఏర్పాటుచేశారు. చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఫాబ్రికేటెడ్ షెడ్ నిర్మాణానికి సంకల్పించి ఈరోజు శంకుస్థాపన చేయడం జరిగినదని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈ షెడ్ నిర్మాణం ద్వారా బ్రహ్మోత్సవాలు, వేడుకలు నిర్విఘ్నంగా జరుపుకొనుటకు, భక్తుల సౌకర్యార్థం నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు పొట్టు బాబురావు,పడమటి మల్లా రెడ్డి, నరేందర్ గౌడ్,శ్రీధర్ రెడ్డి, ఉప్పల వినోద్ కుమార్, శ్రీ జి సత్యనారాయణ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, ఆలయ కార్యనిర్వాహనాధికారి కృష్ణమాచార్యులు, మాజీ కార్పొరేటర్ ధన్ పాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్,మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజిరెడ్డి, సీతారామ్ రెడ్డి, కొబ్బనూరి నాగరాజు, పి పవన్ కుమార్,టి శ్రీహరి, సంతోష్ చారి, గుణశేఖర్, మురళి, కె రాజు, సతీష్ యాదవ్, జగదీష్, షాబుద్దీన్, రాజన్, ఆకుల సంతోష్, డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అరుణ్ కిరణ్, ఆలయ ప్రధానార్చకులు రవి మూర్తి శర్మ మరియు ఆలయ సిబ్బంది శ్రీనివాస్ గౌడ్ , స్థానిక నాయకులు శ్రీ పరంథోడ్ శ్రీనివాస్, శ్రీ లక్ష్మణ్, మోతిలాల్, భక్తులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ తూప్రాన్ ఘనత

**- లయన్ డాక్టర్ జానకిరామ్ సి.ఆర్ అవార్డు ప్రదానోత్సవం**

**- అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఇంటర్ నేషనల్ డైరెక్టర్ పి.ఎం.జె.ఎఫ్. లయన్ డాక్టర్ గంటమనేని బాబురావు చేతుల మీదుగా అవార్డ్ అందుకున్న లయన్ డాక్టర్ జానకిరామ్**

**- అభినందించిన గవర్నర్ లయన్ అమర్ నాథ్**




**తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ తూప్రాన్‌కు గర్వకారణంగా క్లబ్ సెక్రటరీ లయన్ డాక్టర్ జానకిరామ్ సి.ఆర్ గారు ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ కొంపల్లిలోనీ కేవిఅర్ కన్వెన్షన్ లో నిర్వహించిన 320 డి డిస్ట్రిక్ట్ ఇన్స్టలేషన్ కార్యక్రమంలో రామ్ మనోహర్ సౌభాగ్య ఆధ్వర్యంలో జరిగిన “జననీ జన్మభూమిశ్చ” కార్యక్రమం భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలో లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ “లోకమాన్య బాల గంగాధర్ తిలక్” గురించి ప్రేరణ కలిగించే విధంగా ఆయన ప్రతిభా పాటవాలతో అద్భుతంగా స్పీచ్ ఇచ్చి విజయం సాధించి స్పెషల్ కమాండెంట్ అవార్డ్ ను అందుకున్నారు. ఈ అవార్డును అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఇంటర్ నేషనల్ డైరెక్టర్ పి.ఎం.జె.ఎఫ్. లయన్ డాక్టర్ గంటమనేని బాబురావు చేతుల మీదుగా లయన్ డాక్టర్ జానకిరామ్ సి.ఆర్ స్వీకరించడం విశేషం. ఈ సందర్భంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తూప్రాన్ ప్రెసిడెంట్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ట్రెజరర్ లయన్ నీల ప్రవీణ్ కుమార్ గుప్త, లయన్ జె. దామోదర్ రెడ్డి, లయన్ నేతి సాగర్ గుప్త, లయన్ పాదాల కిరణ్, లయన్ సి.ఆర్. ప్రవీణ్ కుమార్ గౌడ్, లయన్ దేవత, శ్రవణ్ కుమార్ గుప్త, లయన్ సబ్బనీ సుమంత్ గుప్త, టి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని జానకిరామ్ సి.ఆర్ కి అభినందనలు తెలిపారు. ఈ విజయం తూప్రాన్ లయన్స్ క్లబ్‌కు మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందని సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ ని గవర్నర్ లయన్ అమర్ నాథ్ , రీజియన్ చైర్మన్ లయన్ ఉప్పల సంజయ్ గుప్త , చైర్మన్ లయన్ ఆకుల సుఖేందర్ లు ప్రత్యేకంగా అభినదించారు.

## 50 మందితో కాంగ్రెస్ పార్టీ లో చేరిన మాజీ ఎంపీపీ,సర్పంచ్ వరలక్ష్మి సత్యనారాయణ దంపతులు : కండువా కప్పిన మంత్రి వివేక్





**తూప్రాన్,చేగుంట,వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్**

: దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ దార వరలక్ష్మీ సత్యనారాయణ మాజీ సర్పంచ్, దంపతులు బుధవారం రోజున రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి సహకారంతో చేగుంటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు వారికి మంత్రి వివేక్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు, అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు, దారా సత్యనారాయణ మాజీ సర్పంచ్ వెంట ఎల్లవేళలా ఉండే మరో 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు మంత్రి వివేక్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు, రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మండలం దార సత్యనారాయణ మాజీ సర్పంచ్, కౌడ నరేష్, శివంది నాగులు, ఎండి ఆసిఫ్, ఏం డి సాహిత్, వలి, కే భాస్కర్, గౌస్, షాదుల్లా, ఎస్ కే ఫరూణ్, కోటి, శ్రీను, బిక్షపతి, ఖాదీ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# వర్గీకరణ పై సుప్రీంకోర్టు పునరాలోచించాలి

**స్థానిక ఎన్నికల్లో బీజేపీ కాంగ్రెస్ పార్టీ ల అంతు చూస్తాం**

**డా పసుల రాంమూర్తి జాతీయ అధ్యక్షుడు**




**హైదరాబాద్,వాస్తవ తెలంగాణ న్యూస్:**

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాల మహానాడు సంఘాల ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన ధర్నా ర్యాలీ జరిగింది ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి హాజరు అయి హాలో మాల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం జరిగింది అన్నారు పార్లమెంటు లో మాల నాయకులు రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం ప్రశ్నించాలి అని అన్నారు వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు ను పునరాలోచించాలి అని డిమాండ్ చేశారు రాజ్యాంగం కు విరుద్ధంగా రోస్టర్ విధానం తీసుకువచ్చి ఉద్యోగాలు ప్రమోషన్ లు విద్యార్థి లకు తీవ్ర నష్టం జరుగుతుంది అన్నారు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను మాలలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు స్థానిక ఎన్నికల్లో బీజేపీ కాంగ్రెస్ పార్టీ ల పై మాలలు తిరుగు చేయాలని పిలుపునిచారు మాల అభ్యర్థులను ఎంపిక చేసి గెలిపించు కోవాలన్నారు ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలమంద శేఖర్ సుందర్ రావు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సురేష్ జాన్ మార్క్ మిట్ట సునీత బాబు స్టీవెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# యూరియాపై ఫలించిన ఎంపీల పోరాటం

హైదరాబాద్, ఆగస్ట్ 20: రాష్ట్రంలో రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలంటూ కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఈ వారంలో తెలంగాణకు సరఫరా చేస్తామని సదరు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్ మెంట్ ప్రారంభం కానుంది. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారి చేసింది.రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ ఎంపీలు ఆందోళనలకు దిగారు. దీంతో తెలంగాణ రైతాంగం యూరియా కోసం పడుతున్న కష్టాలు దేశానికి తెలిసింది. దీంతో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిత్వ శాఖ స్పందించింది. కేంద్రం తెలంగాణకు భారీగా యూరియా సరఫరా చేయడంపై



రాష్ట్ర ఎంపీలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు.ప్రతి పక్ష పార్టీలు రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రలపై ఆలోచన చేయాలంటూ రైతాంగానికి ఆయన కీలక సూచన చేశారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు ఏర్పాడ్డాయని తెలిపారు. తెలంగాణ రైతుల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.తెలంగాణలో రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రంలోని మోదీ సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుందని రాష్ట్ర ప్రభుత్వంలోని అగ్రనేతలు ఆరోపించారు. అంతేకాకుండా.. బీజేపీ యేతర పాలిత రాష్ట్రలపై మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందంటూ వారు మండిపడ్డారు. యూరియా కొరతపై దేశ రాజధాని ఢిల్లీ సాక్షిగా నిలదీయాలంటూ పార్టీ ఎంపీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే.

# మళ్లీ పెరుగుతున్న గోదావరి

**- భద్రాద్రి వద్ద రాత్రి 11 గంటలకు 38.3 అడుగులకు చేరిన నీటిమట్టం**

**- అప్రమత్తమైన అధికారులు**



భద్రాచలం: భద్రాచలంవద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 3.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేయడంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు తగ్గుముఖం పడుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. దీంతో బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి తొలి ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 43 అడుగులకు చేరే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తుఅంతకు ముందు సోమవారం రాత్రి 11 గంటలకు 38.5 అడుగలకు చేరిన గోదావరి నీటిమట్టం అర్ధరాత్రి ఒంటి గంటకు 38.5 అడుగులకు తగ్గింది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు 37.9 అడుగులకు తగ్గగా ఉదయం 6గంటలకు 37.3, 9గంటలకు 36.8, మధ్యాహ్నం 12 గంటలకు 36.4 అడుగులకు చేరింది. మధ్యాహ్నం 3 గంటలకు 36 అడుగులకు తగ్గి.. 4 గంటల నుం చి మళ్లీ క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలకు 36.3 అడుగులకు,రాత్రి 11 గంటలకు 38.3 అడుగులకు పెరిగింది. బుధవారం సాయంత్రానికి తొలి ప్రమాద హెచ్చరిక స్థాయికి (43 అడుగులకు) చేరే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా గోదావరి స్నానఘట్టాలు నీటమునగడం, ప్రవాహం తొలి ప్రమాద హెచ్చరికకు చేరువవుతుండటంతో అధికారులు ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను మోహరించారు. అలాగే భక్తులను స్నానాలకు గోదావరిలోకి దిగకుండా నియంత్రిస్తున్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ మద్దతు ఎవరికో తేల్చేసిన కేటీఆర్

హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎన్నిక.. తెలంగాణలో పొలిటికల్ హీట్ పెంచింది. ఇండియా కూటమి అనూహ్యంగా తెలంగాణకు చెందిన వ్యక్తిని బరిలో నిలపడమే దీనికి కారణం. రంగారెడ్డి జిల్లాకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీలక తీతంగా తెలుగు వ్యక్తికి మద్ధతు ఇవ్వాలని కోరారు. తెలుగు రాష్ట్రాల్లోని 42మంది ఎంపీలు సుదర్శన్ రెడ్డికి సపోర్ట్ ఇవ్వాలన్నారు. గతంలో ఎన్టీఆర్ చూపించిన ఐక్యతను మరోసారి చాటాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఢిల్లీలో ఎవరు బాస్‌లు లేరని.. తెలంగాణ ప్రజలే తమ బాస్‌లు అని చెప్పారు. ఇంతవరకు ఏ పార్టీ నేతలు తమను సంప్రదించలేదని అన్నారు.కాంగ్రెస్ థర్డ్ క్లాస్ చిల్లర పార్టీ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి మద్దతు ఇచ్చిన వారికి తాము మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థి దొరకలేదా..? కంచె



ఐలయ్య వంటి వ్యక్తులు కాంగ్రెస్ పార్టీకి కనిపించలేదా..? అని ప్రశ్నించారు. కంచె ఐలయ్యని పెడితే బేషరత్తుగా మద్ధతు ఇచ్చేవారమని చెప్పారు. సెప్టెంబర్ 9 వరకు రాష్ట్రానికి 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఎవరు ఇస్తే వాళ్లకే తమ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. రైతులు యూరియా కోసం లైన్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. చేతకాని కాంగ్రెస్ పాలనలో ఒక బస్తా ఎరువు కూడా దొరకడం లేదని విమర్శించారు. ఎరువుల బస్తాల కోసం రైతులు అధికారుల కాళ్ళు పట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు.కేసీఆర్ ప్రభుత్వంలో ఆరు నెలల ముందే యూరియా స్టాక్ తెప్పించి.. రైతులకు ఇబ్బందులు లేకుండా చూశామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్‌కు పరిపాలన చేతకావడం లేదని.. కనీస అవగాహన లేదన్నారు. వ్యవసాయంపై సీఎం రేవంత్ సమీక్ష కూడా చేయలేదని.. ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉంటే గ్రౌండ్‌లో పరిస్థితి ఏం తెలుస్తుందని నిలదీశారు. ప్రభుత్వం, సీఎం వైఫల్యం వల్లే మహబూబాబాద్‌లో రైతులపై లాఠీఛార్జ్ జరిగిందన్నారు. పొట్టకూటి కోసం వచ్చినవారితో తమకు ఎలాంటి పంచాయతీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అందరూ ఇక్కడ కలిసికట్టుగా ఉండాలన్నదే తమ భావన అని చెప్పారు.

# మద్యం షాపుల లైసెన్స్‌లపై ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్, ఆగస్టు 20: తెలంగాణలో మద్యం షాపుల లైసెన్స్ గడువు మరి కొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ రేవంత్ సర్కార్ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ క్రమంలో జనాభా ప్రాతిపదికన లిక్కర్స్ షాప్స్‌కు లైసెన్స్ ఫీజును ప్రభుత్వం ఖరారు చేసింది. ఐదు వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో వైన్స్ షాపు లైసెన్స్ ఫీజు రూ. 50 లక్షలుగా ఖరారు చేసింది. ఇక ఐదు వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే.. రూ. 55 లక్షలు, అలాగే 50 వేల నుంచి లక్ష వరకు జనాభా ఉంటే రూ. 60 లక్షలు, లక్ష జనాభా నుంచి ఐదు లక్షల జనాభా ఉంటే.. రూ. 65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు రూ. 85 లక్షలు, 20 లక్షలకు పైగా ఉన్న ప్రాంతాల్లో రూ. కోటి పది లక్షల లైసెన్స్ ఫీజు కింద చెల్లించాలని అబ్కారీ శాఖ నిర్ణయించింది.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2620 మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది నవంబర్ 30వ తేదీతో మద్యం షాపుల లైసెన్లులు ముగియనున్నాయి. వచ్చే విడతకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అబ్కారీ శాఖ ముందుగానే కసరత్తు చేపట్టింది. అందులోభాగంగానే ఈ లైసెన్స్ ఫీజును నిర్ణయించింది.

# హైదరాబాద్‌లో కేబుళ్లు కట్ నెట్ ప్రొవైడర్స్, ఉద్యోగుల ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ స్తంభాలపై ఉండే కేబుళ్లను కట్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ షాక్ వల్ల ఇటీవల పలువురు మరణించారు. బండ్లగూడలో ఇద్దరు, రామంతాపూర్‌లో ఇద్దరు కరెంట్ షాక్‌తో చనిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. ఈ అంశాలపై రివ్యూ నిర్వహించిన భట్టి.. తక్షణమే కేబుళ్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు కేబుళ్లను కట్ చేస్తున్నారు. అధికారుల చర్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. చాలా మంది నెట్ రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే ఉద్యోగులు ఫైర్ అవుతున్నారు. మరోవైపు ప్రభుత్వ తీరుపై నెట్ ప్రొవైడర్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.లకేబుల్ కోతల కారణంగా నగరంలోని పెద్ద సంఖ్యలో బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు ఇంటర్నెట్ కట్‌లతో ఇబ్బందులు పడుతున్నారని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై డైరెక్టర్ జనరల్ ఎస్పీ కొచ్చర్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ కేబుల్స్‌ను విచక్షణారహితంగా కత్తిరించడం వల్ల ప్రజలకు ఇంటర్‌నెట్ అంతరాయం ఏర్పడిందన్నారు. "ఇంటర్నెట్ కేబుళ్లలో కరెంట్ ఉండదు. కరెంట్ షాకులకు కేబుల్ వైర్లకు ఎటువంటి సంబంధం లేదు" అని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ



చర్యల వల్ల నిత్యావసర సేవ అయిన ఇంటర్నెట్ కనెక్టివిటీకి తీవ్ర అంతరాయాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు.ఈ అంతరాయం వల్ల వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునే ఉద్యోగులు, ఆన్‌లైన్ విద్యార్థులు, డిజిటల్ సేవలను ఉపయోగించుకునే సంస్థలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్ తరగతులు, వీడియో కాన్ఫరెన్స్‌లు, సాధారణ డిజిటల్ లావాదేవీలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. సమస్యను పరిష్కరించడానికి, సేవలను వీలైనంత త్వరగా పునరుద్ధరించడానికి ఇంటర్నెట్ సేవల సంస్థలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపింది. తెగిపోయిన కేబుల్‌లను గుర్తించి వాటిని మరమ్మత్తు చేయడానికి సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. అయితే విద్యుత్ శాఖ తరచుగా కేబుళ్లను కత్తిరించడం వల్ల మరమ్మత్తులు పూర్తయిన వెంటనే మళ్ళీ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఐఎస్‌పీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సీవోఏఐ విజ్ఞప్తి భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు పునరావృతం కాకుండా ఉండటానికి, టీజీఎస్‌పీడీసీఎల్ కేబుల్‌లను కత్తిరించకుండా ఉండాలని %జూూ×% విజ్ఞప్తి చేసింది. దేశ ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ అభివృద్ధిలో ఇంటర్నెట్ కనెక్టివిటీ కీలక పాత్ర పోషిస్తున్నందున, ఇటువంటి చర్యలు డిజిటల్ ఇండియా లక్ష్యానికి ఆటంకం కలిగిస్తాయని వ్యాఖ్యానించింది. ఇంటర్నెట్ కనెక్టివిటీ ఒక ముఖ్యమైన సేవ అని, దీనికి అంతరాయాలు లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని కొచ్చర్ నొక్కి చెప్పారు.ఎస్పీడీసీఎల్ సీఎండీతో భేటీ..మరోవైపు తమను ఇబ్బంది పెట్టొద్దని ఎస్పీడీసీఎల్ సీఎండీని ఇంటర్నెట్ అండ్ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ సభ్యులు కలిశారు. సమస్య పరిష్కరణానికి ఒక ప్రణాళికతో రావాలని అసోసియేషన్ సభ్యులకి సీఎండీ సూచించారు. బుధవారం ఉదయం మరోసారి సీఎండీతో సమావేశం కానున్నారు. రేపు చర్చలు విఫలమైతే తమ కార్యచరణ జేఏసీ సభ్యులు ప్రకటించనున్నారు. అవసరమైతే ఇంటర్నెట్ స్వయంగా నిలిపివేసే యోచనలో ప్రొవైడర్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

# అర్హులను గాలికి వదిలి అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లా: నున్న నాగేశ్వరరావు



మధిర, ఆగస్టు 20 : అర్హులను గాలికి వదిలేసి అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తారా అని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో కాటబత్తి వీరబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన దేవసాని వీరకృష్ణ సంతాప సభలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నిరుపేదలెవరో, భూస్వాములు ఎవరో తెలియదా అని ప్రశ్నించారు. పాతర్లపాడు, నాగులవంచ గ్రామంలో 10 ఎకరాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి నిరుపేదలకు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను పక్కన పెట్టి కాంగ్రెస్ నాయకులు అధికారం తమ చేతుల్లో కీలుబొమ్మలాగా చక్రం తిప్పుతున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్న వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావు, రాష్ట్ర నాయకులు మునుకుంట్ల సుబ్బారావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సిపిఎం మండల కార్యదర్శి రాచబంటి రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వత్సవాయి జానకి రాములు, రౌతు అప్పారావు, ఆలస్యం రవి, తోటకూర వెంకట నరసయ్య, దొడ్డ చందర్రావు, బీఆర్ఎస్ నాయకుడు సామినేని అప్పారావు, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి తాళ్లూరు యాదగిరి పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌కు అందాల పోటీ మీద ఉన్న శ్రద్ధ యూరియా మీద లేదాయె : హరీశ్‌రావు

సిద్దిపేట : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్‌కు అందాల పోటీ మీద ఉన్న శ్రద్ధ.. యూరియా మీద లేదాయె అని హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.51సార్లు ఢిల్లీ వెళ్ళిన రేవంత్ రెడ్డికి యూరియా ఇచ్చే తెలివి లేదు, ముందుచూపు లేదు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన తెచ్చిండు. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమీక్ష చేయకుండా, ఇంతటి దుస్థితి తెచ్చిండు రేవంత్ రెడ్డి. కేసీఆర్ రైతులకు అగ్ర తాంబూలం వేస్తే.. రేవంత్ రైతులను అత:పాతాళంలో పడేశారు. కేసీఆర్ గోదావరి జలాలతో రైతుల పాదాలు కడిగాడు%"% రేవంత్ రెడ్డి యూరియా కోసం రైతులతో పోలీసుల కాళ్లు మొక్కిస్తున్నారు. యూరియా ఇవ్వని కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరిగే హక్కు లేదు. ఊర్లలో కాంగ్రెస్ మంత్రులను, కాంగ్రెస్ నేతలను తిరగనివ్వం.. ఎక్కడిక్కడ అడ్డుకుంటాం.



వెంటనే రైతులకు యూరియా అందించాలి లేకుంటే యూరియా కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.రాష్ట్రంలో యూరియ కొరతతో రైతులు నానా అవస్తలు పడుతున్నారు. రైతులకు కంటి నిండా నిద్ర పట్టడం లేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుంభకర్ణుడిల నిద్రిస్తుంది. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పులు లైన్‌ల పెట్టే పరిస్థితి నుండి.. కేసీఆర్ ప్రభుత్వంలో చెప్పులకు చెక్ పెట్టి రైతుల చెంతకు యూరియా అందించాం. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది. సగంమంది రైతులకు రుణమాఫీ కాలేదు. వడ్లు అమ్మి మూడు నెలలు అయిన రైతులకు రూ. 1300 కోట్ల బోనస్ డబ్బులు ఇవ్వలేదు. రుణమాఫీ పేరిట రైతులను ఎంతకాలం ఉసూరు పోసుకుంటవ్ రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఇచ్చింది ఏంటి అన్ని ఎగ్గొట్టడం తప్ప అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.ఏ ఎన్నికలు పెట్టిన కాంగ్రెస్‌కు ఆ చేతులే గుణపాఠం చెపుతాయి. అందాల పోటీలకు మీటింగ్‌లు పెట్టావు కానీ రైతుల కోసం ఎందుకు మీటింగ్‌లు పెట్టడం లేదు. రేవంత్ రెడ్డి చేతగాని ముఖ్యమంత్రి. బడే బాయ్ చోటా బాయ్ కలిసి రైతులకు ఏం న్యాయం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు. యూరియా ఇవ్వని కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరిగే హక్కు లేదు. యూరియా ఇవ్వని కాంగ్రెస్ నేతలను ఎక్కడిక్కడ అడ్డుకుంటాం. రేవంత్ నోరు విప్పితే కేసీఆర్‌ను తిట్టుడు తప్ప ఏం లేదు. వెంటనే రైతులకు యూరియా అందించాలి లేకుంటే యూరియా కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం అని హరీశ్‌రావు హెచ్చరించారు.

# మేడారం జాతరకు రూ.150 కోట్లు మంజూరు చేసిన తెలంగాణ సర్కార్



మేడారం: ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర..మేడారం జాతర. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే అడవి బిడ్డల పండగ వచ్చే ఏడాది జరుపుకోనున్నారు. ఇప్పటికే సమ్మక్క-సారలమ్మ జాతర మహోత్సవ వేడుకల తేదీలను అక్కడి పూజారుల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మేడారం మహా జాతర కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటకు శ్రీకారం చుట్టేందుకు రెడీ అవుతోంది. ఈ జాతర కోసం 150 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది గిరిజన సంక్షేమ శాఖ.వచ్చే ఏడాది జనవరిలో జరిగే మేడారం మహా జాతర నిర్వహణ, మేడారం లో శాశ్వత నిర్మాణాల పనుల కోసం ఈ నిధులను ఉపయోగించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారం మహా జాతర ను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 150 కోట్లు మంజూరు చేసిందని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కు ధన్యవాదాలు చెప్పారు.

# బతుకమ్మ కుంట అభివృద్ధి పనులపై హైడ్రా ఫోకస్



హైదరాబాద్, ఆగస్టు20: బతుకమ్మ కుంట అభివృద్ధిపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్.(బుధవారం) పరిశీలించారు. చెరువును కాపాడేందుకు శాశ్వత సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మ పండగ వచ్చే లోపు చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు నిర్మాణం పూర్తయిందని.. చేయాలని సూచించారు రంగనాథ్.చెరువు చుట్టూ అందమైన మొక్కలు, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పెద్దలు సేదతీరే గుమ్మటాలు, హైజెనిక్ రెస్ట్ రూమ్‌ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువు చుట్టూ వాక్ వే, చెట్ల పెంపకం, వాకర్స్ కూర్చునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువు ఇన్ లెట్ - ఔట్ లెట్ వ్యవస్థలు సరిగా పనిచేసేలా చూడాలని మార్గనిర్దేశం చేశారు. వర్షాకాలంలో వరదనీరు కాలనీలను ముంచకుండా నేరుగా చెరువులోకి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు నిండిన తర్వాత నీరు కిందకు సులభంగా వెళ్లేలా అవాంతరాలు లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. బతుకమ్మ కుంటను వరద నివారణ, భూగర్బ జలాల పెంపు, పర్యావరణ పరిరక్షణలో నమూనాగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు.

# తిరుపతి వెళ్లే భక్తులకు అలర్ట్



**తిరుపతి:** తిరుమల తిరుపతి దేవస్థానం నవంబర్ నెలకు సంబంధించిన దర్శన టిక్కెట్లు, సేవా కోటాలు, వసతి బుకింగ్‌ల ఆన్‌లైన్ తేదీలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే టీటీడీ షెడ్యూల్ ప్రకారం.. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవలకు సంబంధించిన ఆర్జిత సేవా టిక్కెట్ల కోటా ఆగస్టు 18న వెబ్‌సైట్ ద్వారా విడుదల చేశారు. భక్తులు ఇవాళ(ఆగస్టు 20) వరకు ఎలక్ట్రానిక్ డిప్ కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపింది. విజయవంతమైన దరఖాస్తుదారులు(ఆగస్టు 20) నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు చెల్లింపును పూర్తి చేయాలని టీటీడీ పేర్కొంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, అర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకర సేవా టిక్కెట్లు రేపు(ఆగస్టు 21) ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పుకొచ్చింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, అనుబంధ దర్శన స్లాట్‌ల కోటా విడుదల చేయబడుతుందని వెల్లడించింది.కాగా, ఆగస్టు 23న అంగప్రదక్షిణం టోకెన్ల కోటా ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్ట్ టిక్కెట్లు ఉదయం 11 గంటలకు విడుదల చేయబడతాయని టీటీడీ తెలిపింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు, సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులకు ఉచిత ప్రత్యేక దర్శన టోకెన్ల కోటా విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. నవంబర్ నెలకు సంబంధించిన స్పెషల్ ఎంట్రీ దర్శనం టికెట్ రూ.300 కోటా ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు విడుదల అవుతుందని స్పష్టం చేసింది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు వసతి కోటా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తుందని వివరించింది. భక్తులు తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే అర్జిత సేవలు, దర్శన టిక్కెట్లు, వసతిని బుక్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది.

## వైసీపీ జెండాలతో తిరుమలకు పాదయాత్ర

### - అడ్డుకుని 10మందికి పోలీసుల అనుమతి



**చంద్రగిరి(తిరుపతి):** లిక్కర్ కేసులో నిందితుడు ఎంపీ మిథున్‌రెడ్డి) ఆరోగ్యం బాగుండాలని తిరుమలకు పాదయాత్రగా వస్తున్న వైసీపీ కార్యకర్తలను చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శనివారం వైసీపీ విద్యార్థి సంఘం నాయకుడు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది పీలేరు నుంచి పార్టీ జెండాలతో తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు శ్రీనివాసమంగాపురానకి చేరుకున్నారు.పార్టీ జెండాలతో శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్ళకూడదని డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీవారి మెట్టు మార్గంలో ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని 10 మందిని అనుమతిస్తామని చెప్పడంతో వారు అంగీకరించారు. అయితే 10 మంది కాకుండా పోలీసుల కళ్లు గప్పి మరో ఆరు గురు వెళ్ళారు. దీంతో టీటీడీ సెక్యూరిటీ, పోలీసులు అప్రమత్తమై ఆ ఆరుగురిని అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# అమరావతిలో ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**అమరావతి :** అమరావతిలో రతనాటాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. మంగళగిరి వద్ద లాంఛనంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లు దీనిని ప్రారంభించారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు అయ్యింది. ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్ కేంద్రంగా విలసిల్లేలా కార్యాచరణను సిద్ధం చేశారు. కుటుంబానికో పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేయడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రిడ్ ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతి కేంద్రంగా హబ్, తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురంలో స్పోక్?లు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, నాదెండ్ల మనోహర్, టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్?లు పాల్గొన్నారు. పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకంవినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా ప్రోత్సాహకాలు కల్పించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక వేదిక కానుందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్? తెలిపారు. ఆలోచనలకు తగ్గ ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ వేదిక పని చేస్తుందన్నారు. ఇందుకనుగుణంగా విద్యా వ్యవస్థ పునాదులు బలోపేతం చేసి విద్యార్థి దశ నుంచే ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ముందున్న సవాళ్లకు తగ్గట్టుగానే అవకాశాలను అందిపుచ్చుకునే కార్యాచరణతో పని చేస్తున్నట్లు చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రంలో పని చేస్తున్నందున దేశానికి ఏపీ ఆవిష్కరణల హబ్?గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా మన్నారు. వ్యాపారం అంటే లాభాలు మాత్రమే కాదని విలువలు, మానవత్వంతో కూడిన పని అని చాటిన మహనీయుడు రతన్ టాటా అని లోకేశ్ కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తికి ఈ వినూత్న ఆవిష్కరణల వేదికను అంకితమిస్తున్నట్లు తెలిపారు

## విశాఖలో లేడీ దొంగ హల్చల్ కంట్లో కారం కొట్టి చోరీ.



**విశాఖ:** ప్రస్తుత సమాజంలో.. ఏ పనిలో అయిన మగవాళ్ళకు ధీటుగా ఆడవారు తయారవుతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. విద్యా రంగంలో కావచ్చు.. స్పోర్ట్స్‌లో కావచ్చు.. బిజినెస్‌లో కావచ్చు మేము ఏం తక్కువ కాదు అంటూ వారి ఉనికి చాటుకుంటున్నారు. మగవాళ్ళకు సమానంగా పనులు చేస్తూ.. దేనిలోనూ ఆడవారు తక్కువ కాదు అని నిరూపిస్తున్నారు. అయితే తాజాగా ఓ లేడీ కూడా మగవారితో పోటీ పడింది. పోటీ పడితే తప్పేంటి అంటారా... పోటీ పడింది.. చదువులోనో.. ఆటల్లోనో కాద్ అండి.. దొంగ తనంలో. అవును దొంగ తనంలో.. మగ దొంగలకు పోటీ ఇద్దామనుకుందో ఏమో.. మగ దొంగల మాదిరిగా నేరాలకు ఒడిగడుతోందివిశాఖలో లేడీ దొంగ రెచ్చిపోయింది. లాసెన్స్ బే కాలనీలో ఇంటి ఆవరణలో కూర్చొని ఉన్న మహిళ కంట్లో కారం కొట్టి.. చేతికి ఉన్న బంగారు గాజులను లాక్కెళ్లింది. స్థానికులు పట్టుకుందామని ప్రయత్నం చేసిన వారి చేతికి చిక్కకుండా.. పరారయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే.. పలు చోట్ల ఈ లేడీ దొంగ నేరాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసులు తెలిపారు. త్వరలోనే ఆమెను అరెస్ట్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# గిరిజనుల అభివృద్ధికి చర్యలు : మంత్రి సంధ్యారాణి



**శ్రీశైలం :** గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. శ్రీశైలంలో గిరిజన బహుళ ప్రయోజన మార్కెటింగ్ కేంద్రం భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.కోటి మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రైబల్ మల్టిపర్పస్ మార్కెటింగ్ కేంద్రం గిరిజన సమాజానికి వరమని.. నిర్మాణం పూర్తయితే శ్రీశైలం, పరిసర ప్రాంతాల్లోని వారికి సామాజికంగా, ఆర్థికంగా ప్రయోజనం ఉంటుందన్నారు. గిరిజనులు ఉత్పత్తి చేసే వ్యవసాయ పంటలు, వనరులు, ఉత్పత్తులు, హస్తకళలు, చిన్న తరహా పరిశ్రమల ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు చేరవేసే వేదికగా ఇది పనిచేస్తుందని చెప్పారు.గిరిజనులు మధ్యవర్తులు లేకుండానే ఉత్పత్తులకు మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, గిరిజన యువతకు వ్యాపార అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కేంద్రాలు మరిన్ని ప్రాంతాల్లో స్థాపించి, గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచు గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను అందిపుచ్చుకొని చెంచులు అందరు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, జయసూర్య, గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుల దోపిడీని అడ్డుకుంటాం : వైసీపీ మాజీ మంత్రి కాకాణి



**అమరావతి :** ఏపీలో లిక్కర్‌కేసుతో పాటు మరో 6 కేసుల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి బెయిల్‌పై బుధవారం విడుదల అయ్యారు. దాదాపు 83 రోజుల పాటు వివిధ కేసుల్లో ఉన్న ఆయనకు అన్ని కేసుల్లో బెయిల్ మంజూరుకావడంతో నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలు(నుంచి బయటకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై టీడీపీ, కూటమీ నాయకులు అక్రమంగా కేసులు పెట్టి జైలులో పెట్టారని, కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే తనపై కేసులు పెట్టారని ఆరోపించారు. సర్వేపల్లిలో టీడీపీ నాయకుడు సోమిరెడ్డి అవినీతికి అడ్డే లేకుండాపోయిం దని విమర్శించారు.ఈ దోపిడీని పోరాటం ద్వారా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కేసులు కోర్టుల్లో ఉన్నందున తానేమి వాటిపై మాట్లాడడం భావ్యంకాదని అన్నారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి దుర్మార్గమని అన్నారు.

# సాక్షి మీడియాపై టీటీడీ ఛైర్మన్ పరువు నష్టం దావా



**తిరుమల,ఆగస్టు20:** టీటీడీపై అసత్య ప్రచారం విషయంలో సాక్షి మీడియాపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపరువు నష్టం దావా వేశారు. తిరుమలపై సాక్షిలో అసత్య ప్రచారం చేస్తున్నారని లీగల్ నోటీసులో తెలిపారు. సాక్షి మీడియా తక్షణమే టీటీడీకి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. టీటీడీకి రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో బీఆర్ నాయుడు మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా తాను తొమ్మిది నెలల నుంచి పనిచేస్తున్నానని తెలిపారు బీఆర్ నాయుడు.రెండు లక్షల మందికి అన్నదానం..తిరుమల కొండపై అన్న ప్రసాదం సుమారు రోజుకు రెండు లక్షల మంది సేవిస్తున్నారని వివరించారు. అన్న ప్రసాదంలో వడలాంటి కొత్త పదార్థాలను చేర్చామని వెల్లడించారు. రద్దీ ఉండే ప్రాంతాల్లో కూడా అన్న ప్రసాదం సరఫరా జరుగుతోందని తెలిపారు. తిరుపతిలో స్థానికంగా ఉన్నవాళ్లకి నెలకు ఒకసారి శ్రీవారి దర్శనం గతంలో ఉండేదని.. మళ్లీ ఆ దర్శనాన్ని తాము పునరుద్ధరించామని చెప్పుకొచ్చారు. టీటీడీలో అన్యమతస్థులు ఎవరైతే పనిచేస్తున్నారో వాళ్లని వేరే డిపార్ట్‌మెంట్‌కి పంపించామని.. కొంతమందికి వాలంటరీ రిటైర్ట్‌మెంట్ ఇచ్చామని గుర్తుచేశారు బీఆర్ నాయుడు.టీటీడీలో అన్యమతస్థులపై చర్యలు.టీటీడీలో అన్యమతస్థులపై ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. తిరుమల కొండపైన క్యాంటీన్‌లను వైసీపీ నేతలు తీసుకొని మాఫియాలాగా చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీవాణి దర్శనం సమయం మార్చామని.. ఉదయం నుంచి రాత్రి వరకు కాకుండా వెంటనే జరిగేలా చూశామని వెల్లడించారు. వీఐపీ దర్శన టైమింగ్ కూడా మార్చామని తద్వారా సామాన్యులకు దర్శనం సులువు అవుతుందని వివరించారు. అలిపిరి వద్ద భద్రత కొంత ఆలస్యం అవుతుందని.. వాటి కోసం కొత్త ఎక్విప్‌మెంట్ సమకూర్చుకుంటున్నామని చెప్పుకొచ్చారు. టీటీడీ పేరిట నకిలీ వెబ్‌సైట్‌లను పెట్టిన వారిపై చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా టీటీడీ దేవాలయాలు ఉండాలని. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విన్నవించామని గుర్తుచేశారు బీఆర్ నాయుడు.కొత్త దేవాలయాల నిర్మాణం.టీటీడీలో మత మార్పిడిని నివారించడానికి కృషి చేస్తున్నామని.. అందుకు కొత్త దేవాలయాలు నిర్మించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హిందూ ధర్మ ప్రచారం కోసం ప్రత్యేక పుస్తకాన్ని భక్తులకు ఇస్తున్నామని వెల్లడించారు. సిమ్స్‌లో 600 పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. వాటిని వెంటనే భర్తీ చేయడానికి నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. శ్రీవారి ప్రసాదం నాణ్యత కోసం ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. తాము ఎంత నిస్వార్థంగా పనిచేస్తున్న కొంతమంది పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సాక్షి మీడియా హిందూ మతం మీద దాడి చేస్తోందని ఫైర్ అయ్యారు బీఆర్ నాయుడు.హిందూ ధర్మం అంటే జగన్‌కు పడదు..జగన్ మోహన్ రెడ్డి, భారతి రెడ్డి ఎప్పుడైనా తిరుపతికి వచ్చి శ్రీవారికి తలనీలాలు ఇచ్చారా..? వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం తిన్నారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ ధర్మం అంటే వారికి పడదని.. అందుకే దాడులు చేస్తున్నారని.. వారు దాడులు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు. తాము తప్పు చేస్తే చెప్పాలి కానీ ఇలా నిందలు వేయడం సరికాదని హితవు పలికారు. మీరు ఎవరితో అయినా పెట్టుకోండి తనతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. తన మీద దాడి చేయండి.. కానీ వెంకటేశ్వర స్వామిని అడ్డం పెట్టుకొని అసత్య ప్రచారం చేయొద్దని హితవు పలికారు. వైసీపీ నేత భూమాన కరుణాకర్ రెడ్డి అవినీతి సామ్రాట్, డెకాయిట్ అని ఆరోపించారు. రూ.1600 వందల కోట్లు టెండర్లు ఇచ్చి పది శాతం పర్సెంట్ తీసుకున్నారని బీఆర్ నాయుడు విమర్శించారు.

## బెయిల్‌పై విడుదలైన కాకాణి కేసులు, జైళ్లు మాకు అడ్డు కాదంటూ వ్యాఖ్య



**నెల్లూరు జిల్లా :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యారు. దాదాపు 86 రోజులు పాటు నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన.. ఇవాళ ఉదయం జైలు నుంచి బయటకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి కాకాణి పూజిత, ఎమ్మెల్సీలు మురళి, చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఇతర వైసీపీ నేతలు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని తెలిపారు. చిత్రవిచిత్రమైన కేసులు పెట్టారని.. ఏడు పీటీ వారెంట్‌లు జారీ చేశారని చెప్పారు. ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మా లక్ష్య సాధనలో జైళ్లు అడ్డంకి కాదన్నారు. నెల్లూరు జిల్లా ప్రజలే తన ఆస్తి అని.. మాజీ మంత్రి (నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి) ఇంటిపై దాడి దుర్మార్గమని అన్నారు. సర్వేపల్లిలో సోమిరెడ్డి అవినీతికి అడ్డే లేకుండా పోయిందని.. ఆ దోపిడీని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై పోరాటానికి మానసికంగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# కావలిలో ఉద్రిక్తం వైసీపీ మాజీ ఎమ్మెల్యే కోసం గాలింపు



**నెల్లూరు, ఆగస్టు 20:** కావలిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డికి చెందిన క్రషర్ వద్ద వైసీపీ రౌడీ మూకలు బుధవారం దౌర్జన్యానికి దిగారు. ఆ క్రమంలో క్రషర్ సిబ్బందిపై మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే.. క్రషర్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురి అదుపులోకి తీసుకుని.. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈవిచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి.ఆ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డితోపాటు మరో నలుగురిని పోలీసులు నిందితులుగా చేర్చారు. అయితే వారిలో ఇద్దరు రౌడీ షీటర్లని పోలీసులు చెప్పారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసుల గాలింపు చర్యలు చేపట్టారు.అయితే వారి గాలింపు కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డిని హతమార్చేందుకు రామిరెడ్డి కుట్రలకు తెర తీశారంటూ టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇక వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి స్వయంగా తానే సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈవిచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి.ఆ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డితోపాటు మరో నలుగురిని పోలీసులు నిందితులుగా చేర్చారు. అయితే వారిలో ఇద్దరు రౌడీ షీటర్లని పోలీసులు చెప్పారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసుల గాలింపు చర్యలు చేపట్టారు.అయితే వారి గాలింపు కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

## మంత్రి లోకేశ్ చొరవ

### - విద్యాశాఖకు అదనంగా నిధులు మంజూరు చేసిన కేంద్రం



**అమరావతి :** విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో దేశంలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మునుపెన్నడూ లేనివిధంగా కేంద్రం నుంచి రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని వివిధ విభాగాలకు అదనంగా నిధులు మంజూరయ్యాయి. ఈ విద్యా సంవత్సరం సమగ్ర శిక్షణకు గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను రాష్ట్రానికి కేంద్రం మంజూరుచేసింది. మంత్రి లోకేశ్ చొరవతో నిధుల కేటాయింపు విషయంలో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఐసీటీ ల్యాబ్స్, స్మార్ట్ తరగతులు, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రం ఈసారి రూ.167.46 కోట్ల అదనపు నిధులను మంజూరు చేసింది. దీంతోపాటు డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చడానికి గతంలో 50 శాతం మాత్రమే నిధులు రాగా.. ఈ ఏడాది రూ.45 కోట్లకు గానూ 96 శాతం మేర రూ.43.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆదివాసీ విద్యార్థులకు వసతిగృహాల కోసం రూ.11 కోట్లు మంజూరుచేసింది.

# ట్రంప్‌తో భేటీలో డిజైనర్ సూట్‌తో జెలెన్‌స్కీ డ్రెస్సింగ్ స్టయిల్‌పై సర్వత్రా చర్చ



**ఉక్రెయిన్:** అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఎట్టకేలకు తన డ్రెస్సింగ్ స్టయిల్‌లో మార్పు చేశారు. రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం మొదలైనప్పటి నుంచి మిలిటరీ దుస్తుల్లోనే కనిపిస్తున్న ఆయన.. తాజాగా అమెరికా అధ్యక్షుడుడొనాల్డ్ ట్రంప్ తో జరిగిన సమావేశానికి బ్లాక్ కలర్ డిజైనర్ సూట్ లో హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సమావేశంలో ఆయన వస్త్రధారణ ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.ఈ సూట్‌ను ఉక్రెయిన్‌కు చెందిన ప్రముఖ డిజైనర్ విక్టర్ అనిసిమోవ్ (61) రూపొందించారు. అది కేవలం దౌత్యపరమైన సమావేశం కోసమే కాకుండా, శాంతి చర్చలకు ఒక 'లక్కీ చార్మ్'గా పనిచేస్తుందని డిజైనర్ ఆశాభావం వ్యక్తంచేశారు. జెలెన్‌స్కీ యుద్ధకాలపు ఇమేజ్‌కు, సాధారణ పౌర శైలిని జోడించే ప్రయత్నం చేశామని అనిసిమోవ్ తెలిపారు.వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలో జెలెన్‌స్కీ వస్త్రధారణను ట్రంప్ కూడా ప్రశంసించడం గమనార్హం. గత ఫిబ్రవరిలో వీరిద్దరి మధ్య జరిగిన సమావేశం కాస్త ఉద్రిక్తంగా సాగింది. ఆ సమయంలో జెలెన్‌స్కీ దుస్తులపై ఓ అమెరికన్ జర్నలిస్ట్ చేసిన విమర్శలను అనిసిమోవ్ తీవ్రంగా ఖండించారు. వారు మా జీవన విధానాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారని నిరాశ కలిగిందని అప్పట్లో వ్యాఖ్యానించారు.కాగా రష్యాతో యుద్ధం ముగిసే వరకు సూట్ ధరించనని, గడ్డం కూడా గీయనని 2022లో జెలెన్‌స్కీ ప్రతిజ్ఞ చేశారు. అయినప్పటికీ ఈ కీలక సమావేశం కోసం ప్రత్యేకంగా సూట్ ధరించడం దౌత్య వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు, నాటో సమావేశంలో కూడా జెలెన్‌స్కీ అనిసిమోవ్ రూపొందించిన దుస్తులనే ధరించారు.

# జమ్మూ కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జమ్మూ కశ్మీర్ పునర్య వ్యస్థీకరణ సవరణ బిల్లు, యూటీల సవరణ బిల్లు, 130వ రాజ్యాంగ సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. అయితే, ఈ మూడు బిల్లులను వ్యతిరేకిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఈ మూడు బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని కాంగ్రెస్ ఆరోపించింది. విపక్ష ఎంపీల నిరసనల మధ్య లోక్‌సభ వాయిదా పడింది. బిల్లులను ప్రవేశపెట్టే సమయంలో కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. అమిత్ షా అరెస్టయిన సందర్భంలో నైతికత ప్రదర్శించారా ప్రశ్నించారు.దీనికి హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. తనపై ఆరోపణలు వచ్చిన సమయంలో.. అరెస్టుకు ముందే నైతికంగా రాజీనామా చేశానన్నారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించే వరకు ఏ రాజ్యాంగ పదవిని చేపట్టలేదన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మూడు బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని స్పీకర్‌కు సిఫారసు చేశారు. ఈ సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించాయి. ప్రతిపక్షాలు బిల్లు కాపీని చించి కేంద్ర హోం మంత్రి వైపు విసిరేశారు. స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కట్టబెట్టిన ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆరేళ్లు కావొస్తోంది. 2019 ఆగస్టు 5న ఈ ఆర్టికల్‌ను తొలగించి.. జమ్ము కశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించింది కేంద్రం. తిరిగి జమ్ముక శ్మీర్‌కు రాష్ట్ర హోదా కట్టబెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతున్నది. ఈ క్రమంలోనే బుధవారం లోక్‌సభలో జమ్మూకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది.

# లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ఆగడాలు పెచ్చు మీరాయి. అలాంటి వేళ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025'ను కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రధాన లక్ష్యం.. ఈ - స్పోర్ట్స్, సోషల్ గేమ్స్‌కు ప్రోత్సాహం, ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధిస్తారు. అలాగే యువత, కుటుంబాలను ఆర్థిక, మానసిక, సామాజిక ముప్పుల నుంచి రక్షించడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకు వస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఫాంటసీ స్పోర్ట్స్, రమ్మీ, పోకర్ వంటి గేమ్స్‌పై నిషేధం విధిస్తారు.ఈ - స్పోర్ట్స్‌కి అధికారిక గుర్తింపు, అలాగే శిక్షణా కేంద్రాలు, అకాడమీలు, పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. సోషల్, విద్యా గేమ్స్ అభివృద్ధికి కేంద్రం మద్దతు తెలుపుతోంది. తద్వారా భారతీయ విలువలతో గేమ్స్ ప్రోత్సాహం అందిస్తుంది. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ప్రకటనలు, లావాదేవీలు నిషేధంబ్యాంకులు, పేమెంట్ సిస్టమ్స్ బ్లాక్ చేస్తారు. కేంద్ర స్థాయిలో ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఏర్పాటుకు సంసిద్ధత. నిబంధనల ఉల్లంఘనకు జైలు శిక్షలు, రూ. కోట్లాది జరిమాన విధిస్తారు. డిజిటల్ ఇండియాలో సమతుల్యత, వినూత్నతకు ప్రోత్సాహం, సమాజ రక్షణకు ఈ బిల్లు పాటుపడుతుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

# అవయవ దానానికి ముందుకు వచ్చిన ఆర్మీ చీఫ్ దంపతులు



**న్యూఢిల్లీ:** ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆయన భార్య సునీత ద్వివేది తమ అవయవాలను మరణాంతరం దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మరణాంతరం అవయవ దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి అనేక మంది ప్రాణాలను కాపాడగలుగుతారు. అవయవ దానంపై చైతన్యం పెంచేందుకు హర్యానాలోని చండీమందిర్ మిలటరీ స్టేషన్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో అవయవ దానం ప్రాధాన్యతను ఈ సందర్భంగా ఆర్మీ చీఫ్ వివరించారు. పౌరులు, ముఖ్యంగా యువకులు, డిఫెన్స్ సిబ్బంది ఈ మహోన్నత ఆశయం కోసం ముందుకు రావాలని, అవయవ దానాన్ని జాతీయ ఉద్యమంగా చేపట్టాలని కోరారు. నేషనల్ ఆర్గాన్ డొనేషన్ అండ్ ఎలోకేషన్ ప్రోగ్రాం కింద మార్పులు చేపట్టం జరిగిందని, అవయవాల కేటాయింపులు ఇప్పుడు మహిళా రెసిపెంట్స్‌కు, డోనార్ ఫ్యామిలీస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. మరింత మంది డోనార్లు ముందుకు వచ్చేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు.ఏటా సుమారు 20,000 అవయవాల మార్పిడి (ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్స్) ఇండియాలో జరుగుతున్నాయని, గ్లోబల్ ర్యాకింగ్‌లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. సరిహద్దులను రక్షించడమే కాకుండా సమాజ సంక్షేమం కూడా ఆర్మీ బాధ్యత కావాలని అన్నారు. ఈ బాధ్యతకు కొనసాగింపే అవయదానమని పేర్కొన్నారు.

# పెట్రోల్ పోసి టీచర్‌కు నిప్పు పెట్టి విద్యార్థి




**భోపాల్, ఆగస్ట్ 20:** స్కూల్‌లో పాఠం చెప్పిన టీచర్‌పై పెట్రోల్‌తో దాడి చేసి.. ఆమెను ఒక విద్యార్థి తీవ్రంగా గాయ పరిచాడు. ఈ దారుణ సంఘటన మధ్యప్రదేశ్ నర్సింగ్‌పూర్ జిల్లాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. 18 ఏళ్ల సూర్యాంశ్ కొచ్చార్.. తనకు స్కూల్‌లో పాఠం చెప్పే టీచర్‌పై ప్రేమ పెంచుకున్నాడు. ఈ విషయాన్ని స్కూల్ టీచర్‌కు తెలిపారు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఇదే విషయాన్ని స్కూల్ యాజమాన్యం దృష్టికి టీచర్ తీసుకు వెళ్లింది. దీంతో సూర్యాంశ్ కొచ్చార్‌పై స్కూల్ యాజమాన్యం సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్రమంలో అతడికి స్కూల్ యాజమాన్యం టీసీ ఇచ్చి పంపించేసింది.అనంతరం అతడు మరో స్కూల్‌లో జాయిన్ అయ్యారు. అయితే ఆగస్టు 15. స్వాతంత్ర్య దినోత్సవం. ఈ సందర్భంగా స్కూల్ టీచర్ కొత్త చీర కట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెను సూర్యాంశ్ కామెంట్ చేశాడు. దీంతో ఆగ్రహించిన టీచర్.. అతడిపై మండిపడింది. ఈ నేపథ్యంలో ఆమెపై అతడు కోపాన్ని పెంచుకున్నాడు. అందులోభాగంగా ఆగస్టు 18వ తేదీన పెట్రోల్ బాటిల్‌ను టీచర్ ఇంటికి తీసుకు వెళ్లాడు. ఆ తర్వాత ఆమె శరీరంపై పెట్రోల్ జల్లాడు. అనంతరం అగ్గిపుల్ల వెలిగించి.. ఆమెకు నిప్పంటించాడు. అక్కడ నుంచి అతడు పరారయ్యాడు.స్థానికులు వెంటనే స్పందించి.. ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆమెకు తీవ్ర గాయాలైనా.. ప్రాణానికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా సూర్యాంశ్ కోసం పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు డోంగర్గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళ్యాణ్ పూర్‌లో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాధితురాలి వాంగ్మూలం తీసుకున్న తర్వాత.. అతడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వివరించారు.

# ముంబయిలో వరదలకు ఆరుగురు మృతి



**మహారాష్ట్ర:** మహారాష్ట్రలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు వరదలు పోటెత్తుతున్నాయి. 24గంటల్లో వర్షాలు, వరద సంబంధిత ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు మహారాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ పేర్కొంది. నాందేడ్ జిల్లాలో వరదల కారణంగా ఐదుగురు వ్యక్తులు గల్లంతైనట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 18 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఆరు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ముంబయిల వర్షాల కారణంగా ట్రాక్‌లపై భారీగా వరద నీరు చేరడంతో మంగళవారం ఉదయం నిలిచిన హార్బర్ రైలు సేవలు దాదాపు 15గంటల తర్వాత బుధవారం తెల్లవారు జామున 3గంటలకు తిరిగి ప్రారంభమయ్యాయని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వానిల్ నీలా తెలిపారు.ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, థానే మధ్య ప్రధాన లైన్ సేవలు మంగళవారం రాత్రి 7:30 గంటలకు తిరిగి ప్రారంభించారు. అయితే, నవీ ముంబయిని దక్షిణ ముంబయితో అనుసంధారించే హార్బర్ లైన్ రాత్రి సమయంలో మూసివేశారు. అనేక ప్రాంతాల్లో నీరు పట్టాలపైకి చేరుకుంది. బుధవారం ఉదయం నుంచి అన్ని ప్రజా రవాణా సేవలు, బస్సులు, స్థానిక రైళ్లు, మెట్రో సర్వీసులు సాధారణంగా పని చేస్తున్నాయని దికారులు తెలిపారు. మరో వైపు భారీ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో అత్యవసరమైతేనే రైల్‌లో ప్రయాణించాలని, అప్రమత్తంగా ఉండాలని రైల్వేశాఖ ప్రయాణికులకు సూచించింది. పలు రూట్లలో బుధవారం సైతం రైళ్లను చేసినట్లు పశ్చిమ రైల్వే తెలిపింది. డీఆర్ఎం, ముంబయి సెంట్రల్ మార్గంలో వరద కారణంగా స్థానిక రైలు సేవలను రద్దు చేసినట్లు పేర్కొంది. ప్రయాణాలు వీలైనంత వరకు ఇబ్బంది లేకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పింది.

# మా సభలకు అంతరాయం కల్పించేందుకు కుట్ర



**చెన్నై:** అన్నాడీఎంకే ప్రచారసభలోకి ఖాళీ అంబులెన్స్ రావడంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీసీఎం ఎడప్పాడి పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' నినాదంతో గత నెల 7న ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్రలో భాగం గా సోమవారం రాత్రి వేలూరు సమీపంలోని అనైకట్టు ప్రాంతంలో ఈపీఎస్ రోడ్‌షో నిర్వహించారు. ఈపీఎస్ ప్రసంగిస్తున్న సమయంలో ఉన్నట్లుండి అక్కడకు ఖాళీ అంబులెన్స్ రావడంతో సభలో ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు దీనిపై స్పందించిన ఈపీఎస్ ఇది డీఎంకే కుట్రేనని, తాను పాల్గొంటున్న ప్రచారసభల్లో ప్రజలు భారీసంఖ్యలో తరలివస్తుండటాన్ని చూసి ఓర్వలేక సభను భగ్నం చేసేందుకు ఇలా ఖాళీ అంబులెన్సును పంపించారని దుయ్యబట్టారు. సభలోకి దూసుకొచ్చిన వాహనం వల్ల ప్రజలకు గాయాలైతే తనపై నిందమోపవచ్చని, తాను ఇంతవరకు పాల్గొన్న 30 సభల్లో డీఎంకే నేతలు ఇలాంటి చేష్టలకు పాల్పడ్డారని, ఇలాంటి నీచ సంస్కృతికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.తాను పాల్గొనబోయే తదుపరి సభలో రోగిలేకుండా అంబులెన్స్ వస్తే ఆ డ్రైవరే అదే అంబులెన్స్‌లో రోగిగా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందని ఈపీఎస్ వ్యాఖ్యానించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను గోల్డెన్ అవర్‌లోగా ఆస్పత్రులకు తరలించే అంబులెన్స్‌లకు దారివ్వాల్సిన బాధ్యత వాహన చోదకులదని, అయితే రోగిలేకుండా జనంలోకి అంబులెన్స్ రావడం మంచి పద్ధతి కాదన్నారు. వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేను ఎదుర్కొనే ధైర్యంలేకే అధికార పార్టీ కుయుక్తులు పన్నుతోందని, వీటికి తాము భయపడేదిలేదని ఈపీఎస్ తేల్చిచెప్పారు. ధరల పెంపును నియంత్రించలేని డీఎంకే ప్రభుత్వం ప్రతిపక్షాలకు పెరుగుతున్న ప్రజాదరణతో ఓటమి భయం పట్టుకుందన్నారు.దేశంలోనే ఉన్నత విద్యను చదువుకుంటున్న విద్యార్థులు అధికంగా ఉన్న రాష్ట్రంగా తమిళనాడును ముందుకు నడిపి చరిత్ర సృష్టించిన ఘనత అన్నాడీఎంకే ప్రభుత్వానిదేనని, అనైకట్టులో కొత్తగా రెండు ఆర్ట్స్ కళాశాలలను ప్రారంభించింది కూడా తామేనన్నారు. అదేవి ధంగా అనైకట్టును కొత్త తాలూకాగా ప్రకటించడం, అగడంలో చెక్‌డ్యాం నిర్మించడం, అరియూర్‌లో రైల్వేవంతెన ఏర్పాటు చేసి వాహనాల రద్దీని తగ్గించామన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీ యే కూటమి అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన సీబీ రాధా కృష్ణన్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేసిన ఈపీఎస్ ఆయ నకు ఓటేసి గెలిపించాలని డీఎంకే సహా అన్ని పార్టీలను కోరారు.

# ఒక్కసారిగా కుప్పకూలిన భవనం ముగ్గురు దుర్మరణం



**ఢిల్లీ :** భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ లోని దర్యాగంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై సమాచారం అందిన వెంటనే ఢిల్లీ స్థానిక అధికారులు, ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలంలో భవన శిథిలాల తొలగింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఘటనకు కారణాలపై నిర్ధారణకు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# భారీ వర్షం నాలుగు గంటల రెస్క్యూ ఆపరేషన్



**మహారాష్ట్ర :** రాజధాని ముంబై లో సాంకేతిక సమస్య కారణంగా ఎత్తయిన ట్రాక్‌పై నిలిచిపోయిన మోనోరైలు లో 582 మంది ప్రయాణికులు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. వారందరినీ అధికారులు సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తున్నా రెస్క్యూ సిబ్బంది ఏకంగా నాలుగు గంటలపాటు శ్రమించి వారందరినీ రక్షించారు. దాంతో పెను ప్రమాదం తప్పింది.అయితే రైలులోని 582 మంది ప్రయాణికులు నాలుగు గంటలపాటు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టడంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. మంగళవారం సాయంత్రం 6.15 గంటల సమయంలో ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న మోనోరైలు భక్తిపార్క్ చెంబూర్ స్టేషన్ల మధ్య ఒక్కసారిగా ఆగిపోయింది. సాంకేతిక సమస్యవల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో రైలు కదలలేదు.సమాచారం అందుకున్న బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్కై ల్యాడర్ల సహాయంతో నాలుగు గంటలపాటు శ్రమించి, రైలులో చిక్కుకున్న ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. ఈ ఘటనలో ఊపిరాడక అస్వస్థతకు గురైన 12 మంది ప్రయాణికులను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.రైలు అరగంట ఆలస్యంగా రావడంతో ప్రయాణికులతో కిక్కిరిసిపోయిందని, తాను సాయంత్రం 5.30 గంటల నుంచి రైలులోనే ఉన్నానని, రైలు ఆగిపోయిన ఒక గంట తర్వాత సహాయక చర్యలు మొదలయ్యాయని ప్రమాదం నుంచి బయటపడిన ఒక ప్రయాణికుడు తెలిపారు. కాగా ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ప్రయాణికుల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యమని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎక్స్ ద్వారా భరోసా ఇచ్చారు.ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించినట్లు సీఎం ఫడ్నవీస్ తెలిపారు. భారీ వర్షాలవల్ల హార్బర్ లైన్ మూసివేయడంతో ప్రయాణికులంతా మోనోరైలును ఆశ్రయించారని, రద్దీ పెరగడంతో విద్యుత్ వ్యవస్థపై భారం పడి లోపం తలెత్తిందని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.. ముంబైలో మిథీ నది ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఐదు వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి కుర్లా రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై 8అంగుళాల ఎత్తులో నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో రైలు సర్వీసులను నిలిపివేశారు. ముంబైలో ఆగస్టులో కురిసే మొత్తం సగటు వర్షపాతంలో దాదాపు సగం వాన ఈ రెండు రోజుల్లోనే కురిసిందని అధికారులు వెల్లడించారు. స్కూళ్లకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. బాంబే హైకోర్టు కూడా బుధవారం మధ్యాహ్నం 12.30గంటల వరకే పని చేసింది.భారీ వర్షాలతో ముంబైలో మోనో రైలు మధ్యలోనే ఆగిపోయింది. ఆ సమయంలో అందులో దాదాపు 500మంది ప్రయాణికులు ఉన్నారు. కరెంటు సరఫరాలో సమస్యతోనే రైలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మైసూరు కాలనీ, భక్తి పార్క్ స్టేషన్ల మధ్య సాయంత్రం 6.15గంటలకు రైలు ఆగిపోయింది. ప్రయాణికులు రెండు గంటల పాటు అందులోనే ఉండిపోయారు. అధికారులు కిటికీలు పగులగొట్టి క్రేన్లు, నిచ్చెనల సాయంతో వారిని కిందికి దింపారు.

# పేదల పక్షపాతి...జస్టిస్ సుదర్శన్ రెడ్డి



ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. బలాబలాలు గమనిస్తే ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎన్నిక కావడం లాంఛనమే కానుంది. ఎందుకంటే ఎన్‌డిఎ కూటమికి తగినంత బలం ఉంది. అయితే ఇక్కడ అభ్యర్థుల గుణగణాలు, వారి వ్యక్తిత్వం పరిశీలిస్తే ఇద్దరూ వజ్రం తునకలే. వారివారి రంగాల్లో వారు తమ నిజాయితీతో బతుకుతున్న వారే. ఇప్పటివరకు 16 ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాఠక్, జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా, శంకర్‌దయాళ్‌శర్మలు మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన అన్ని ఎన్నికల్లో ప్రతిపక్షాలు అభ్యర్థిని నిలబెట్టాయి. ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో తొలిసారి జరిగిన ఎన్నికలో అధికారపార్టీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపైన ప్రతిపక్షాలు గోపాలకృష్ణ గాంధీని నిలబెట్టాయి. 2022లో జరిగిన ఎన్నికలో జగదీప్‌ధన్‌ఖడ్‌పై కర్ణాటకకు చెందిన మార్గరెట్ అల్వాను రంగంలోకి దింపాయి. ఇప్పుడు తెలంగాణకు చెందిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ మూడు ఎన్నికల్లో ప్రతిపక్షాల నుంచి దక్షిణాదివారే అభ్యర్థులు కావడం విశేషం.ఈ పోటీ ఎలా ఉన్నా..ఎవరు గెలిచినా విభిన్న వ్యక్తిత్వాల కలగిన ఇద్దరు వ్యక్తుల గుణగణాలను తెలుసుకునే అవకాశం కలిగింది.ప్రధానంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయ కోవిదుడు. నిక్కచ్చిగా,నిర్మొహమాటంగా ఉండే వ్యక్తి. ఆయన సుప్రీం న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే ఇది అర్థం అవుతుంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి దేశంలో పేరొందిన ప్రగతిశీల న్యాయకోవిదుడు. ఆయన సుదీర్ఘ కాలం న్యాయ వ్యవస్థలో ఎన్నో హోదాల్లో పనిచేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం ధైర్యంగా పోరాడారు. అంకుమించి పేదల పక్షపాతిగా పేరుంది. ఆయన రాసిన తీర్పులను చదివితే పేదలకు అనుకూలంగా ఎలా వ్యవహరించారు, రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను ఎలా రక్షించారన్నది తెలుస్తుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడు తర్వాత పోటీ చేస్తున్న రెండో తెలుగు వ్యక్తిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నిలవనున్నారు. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి 1946 జులై 8న రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. హైదరాబాద్ సిటీ- సివిల్‌కోర్టు, హైకోర్టుల్లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1988-90 మధ్య హైకోర్టులో ఆంధప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు. 1990లో సుమారు ఆరు నెలలపాటు- కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గానూ పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి న్యాయ సలహాదారుగా, స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 1993లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబరు 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2007 జనవరి 12 నుంచి 2011 జులై 7 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. ఆనాటి గోవా సిఎం పణిక్కర్ ఏరికోరి సుదర్శన్ రెడ్డిని లోకాయుక్తకు నియమించారు. ఓ రకంగా సుదర్శన్ రెడ్డి నిజాయితీ కారణంగానే ఈ పదవి దక్కింది. ప్రస్తుతం ఐఏఎంసీ శాశ్వత ట్రస్టీగా, బీసీ కులగణన అధ్యయన కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మానవ హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు కీలక తీర్పులు వెలువరించారు. ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదులను ఎదుర్కోవడానికి ఏర్పడిన సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన లక్ష్యంగా ఈ తీర్పు వెలువరించారు. ఆర్మీ వైద్య కళాశాలలో పదవీ విరమణ పొందిన సైనికులు, సైనిక సిబ్బంది వితంతువుల పిల్లలకు అడ్మిషన్‌లు నిరాకరించడం చెల్లదని, దీనివల్ల అణగారిన వర్గాలకు న్యాయం జరగదన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించడంలో భాగంగా... న్యాయమూర్తులపై ఆరోపణలతో వచ్చే ప్రజాప్రయోజన పిటిషన్‌లను అనుమతించ రాదని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నేతృత్వం వహిస్తూ అసైన్డ్ భూసేకరణపై కీలకమైన తీర్పు వెలువరించారు. అసైన్డ్ భూములకు భూసేకరణ చట్టం కింద చట్టబద్ధమైన పరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. గెలుపోట ములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు- కనపడుతోంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో నిజాయితీతో నడిచిన న్యాయకోవిదుడు. సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందేనని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను హింసాకాండకు పాల్పడేందుకు ప్రోత్సహించకూడదని, ఇలాంటి అనైతిక మార్గాలను రాజ్యాంగ విలువలు అనుమతించ బోవని ఆయన విస్పష్టీకరించారు.

# రాధాకృష్ణన్ ఎంపికలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన పాత్ర

ఎన్నికల్లో కూడా ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన భూమిక పోషిస్తుందనడంలో సందేహం లేదు. ఇకపోతే రాధాకృష్ణన్ కూడా సామాన్య వ్యక్తి కాదు. ఆయన తన 16 సంవత్సరాల వయసులో ఆర్‌ఎస్‌ఎస్‌కు అంకితమయ్యారు. 'సంఘ్' తిరుప్పూర్ టౌన్ సంఘ చాలక్‌గా తర్వాత జిల్లా సంఘ్ చాలక్‌గా పనిచేసిన తర్వాత 1974లో ఎమర్జెన్సీకి ముందు జనసంఘ్‌లో చేరారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడ్డప్పుడు రాధాకృష్ణన్ అటల్ బిహారీ వాజపేయికి సహాయకుడుగా ఉన్నారు. బీజేపీ భావజాలానికి ఆయన నిబద్ధత తిరుగులేనిది. తమిళనాడులో 19 వేల కిలోమీటర్ల పాటు- యాత్ర చేసి తమిళనాడులో బీజేపీ అంటే రాధాకృష్ణన్ అననట్లుగా పార్టీకోసం కృషి చేశారు. 1998లో రాధాకృష్ణన్ పోటీ- చేసిన కోయంబత్తూర్ నియోజకవర్గంలో ప్రచారం చేసేందుకు బీజేపీ నేత లాల్ కృష్ణ ఆడ్వాణీ వచ్చినప్పుడే ఆయన పాల్గొనాల్సిన ఎన్నికల సభలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ బాంబులు పేలి 85 మంది మరణించారు. ఒక పత్రికా విలేఖరికి ఇంటర్వ్యూ ఇవ్వడం వల్ల ఆడ్వాణీ కోయంబత్తూర్‌కు ఆలస్యంగా వచ్చారు. ఆయనకుస్వాగతం పలికేందుకు రాధాకృష్ణన్ విమానాశ్రయానికి రావండతో కోయంబత్తూరుకు వెళ్లలేదు. వారిద్దరూ సకాలంలో సభకు చేరుకుని ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో బాంబు పేలుళ్లను బట్టి అర్థంచేసుకోవచ్చు. సంఘ్‌ను రాధాకృష్ణన్ కోయంబత్తూర్‌లో బలోపేతం చేసినందుకే తీవ్రవాదులు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నారనేది స్పష్టమయింది. ఆ ఎన్నికల్లో కోయంబత్తూర్‌లో హిందూ ఓటర్లు సంఘటిత మై రాధాకృష్ణన్ అఖండ మెజారిటీతో గెలిచారు. ఈ క్రమంలో పరిణామాలను గమనిస్తే రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడంలో ఆర్‌ఎస్‌ఎస్ ముందున్నదన్నది స్పష్టం అయ్యింది. అందుకేనేమో మోడీ ఇటీవల తరచూ మోహన్ భగవత్ బాటలో నడుస్తున్నారు.



## మోడీ ఏకపక్ష నిర్ణయాలపై కన్నేసిన సంఘ్

**న్యూఢిల్లీ,ఆగస్ట్20:** మోడీ ప్రధాని అయిన తరవాత బిజెపిలో ఉన్న సీనియర్లను ఒక్కొక్కరినే తప్పిస్తూ తనకు ఎదురులేకుండా చేస్తూ పోతున్నారు. 11 ఏళ్లుగా అదే సాగింది. వాజపేయి - అద్వానీ తరానికి చెందిన వారందరినీ తప్పించిన తీరును చూశాం. అంతెందుకు అద్వానీనే తప్పించాడు. ఇలాగురుభక్తిని ప్రకటించుకున్నారు. రామ్‌నాథ్ కోవింద్ కాకుండా తొలిసారే అద్వానీని రాష్ట్రపతిగా నిలిపే అవకాశం వచ్చినా తెలివిగా వ్యవహరించారు. దీంతో అద్వానీ రక్తం ధారపోసిన పార్టీలోనే చులకనకు గురయ్యారు. రాజ్యాంగ పదవిని అనుభవించే అవకాశం లేకుండా పోయింది. లేకుంటే మాజీ రాష్ట్రపతిగా అయినా అద్వానీ ఉండేవారు. ఇలా మురళీమనోహర్ జోషి లాంటి వారినికూడా పక్కన పెట్టేశారు. అలాగే వెంకయ్యనాయుడును కూడా ఉపరాష్ట్రపతిని చేసి, ఆయనను కూడా బిజెపికి దూరం చేశారు. ఉపరాష్ట్ర పతి కావడంతో తల్లిలాంటి పార్టీకి దూరం అయ్యానని ఇటీవల వెంకయ్యనాయుడు ఆవేదన చెందారు. తాజా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాజ్‌నాథ్‌సింగ్‌ను నిలబెడతారని ప్రచారం జరిగింది. దీంతో రాజ్‌నాథ్‌ను కూడా తప్పించే ఎత్తుగడ మొదలయ్యిందని అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ రంగంలోకి దిగినట్లుగా కనిపిస్తోంది. ఈ మధ్య మోడీ కొంత దూకుడుగా వ్యవహరిస్తూ, ఆర్‌ఎస్‌ఎస్‌తో పనేముందన్న రీతిలో సాగారనే విమర్శలు వచ్చాయి. దీంతో 75 ఏళ్ల వ్యవహారంతో మోహన్ భగవత్ ఒక ఝలక్ ఇచ్చారు. అలాగే తెరవెనక కష్టపడుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను కాదని సాగడం కష్టమని సంకేతాలు ఇచ్చారు. ఈక్రమంలో జగదీప్ దన్‌ఖడ్ స్థానంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంపిక చేయడం చూస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ బలంగా తనముద్ర వేసిందని అనుకోవాలి. మామూలుగా అయితే తనకు నచ్చిన,నమ్మిన బంటును నియమించుకోవడం మోదీ అలవాటు చేసుకున్నారు. అయితే ఇటీవలి కాలంలో కీలకమైన పదవుల్లో ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారిని నియమించి, ఆ సంస్థను సంతృప్తిపరిచే ప్రయత్నాలను మోదీ చేయడం మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. బీజేపీకి వారి అండదండలు అవసరం లేదని పార్టీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా గత ఏడాది అన్నప్పుడున్న పరిస్థితులు వేరు. ఇప్పుడున్న పరిస్థితులకూ తేడా కనిపిస్తోంది. అందుకే అనివార్యంగా ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉన్న రాధాకృష్ణన్ను ఎంపిక చేయక తప్పలేదు. ఓ రకంగా చెప్పాటంలే మోడీ నిరంకుశ విధానాలను గమనిస్తూ వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ మెల్లగా రంగంలోకి దిగందన్న ప్రచారం కూడా ఉంది. రేపటి బిజెపి అధ్యక్ష

# ఢిల్లీలో అనూహ్య ఘటన

**సిఎంకు వినతిపత్రం ఇచ్చినట్లే ఇచ్చి దాడి**

**సిఎం రేఖాగుప్తా చెంపపై కొట్టినయువకుడు**

**దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సిఎం అతిషి**



**న్యూఢిల్లీ,ఆగస్ట్20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఓ యువకుడు దాడి చేశాడు. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో జరిగిన జన్ సున్వై కార్యక్రమంలో ఈ ఘటన జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వర్గాలు తెలిపాయి. నిందితుడిని సంఘటనా స్థలం నుండి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడు మొదట ముఖ్యమంత్రికి ఫిర్యాదుగా ఒక పత్రాన్ని అందజేసి, ఆపై ఆమెపై దాడి చేసినట్లు- బిజెపి నాయకుడు ఒకరు తెలిపారు. సిఎం రేఖ గుప్తాపై జరిగిన దాడిని ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ కూడా ఈ దాడిని ఖండించారు. ఈ సంఘటనను దురదృష్టకరం అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి మొత్తం ఢిల్లీకి నాయకత్వం వహిస్తున్నారని ఆయన అన్నారు. ఢిల్లీ సిఎం భద్రతను కూడా యాదవ్ ప్రశ్నించారు. ఈ సంఘటన మహిళల భద్రతను కూడా బహిర్గతం చేస్తుంది. ఢిల్లీ సిఎం సురక్షితంగా లేకపోతే, ఒక సామాన్యుడు లేదా సాధారణ మహిళ ఎలా సురక్షితంగా ఉంటారు అని దేవేందర్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలు అతిషి బుధవారం ముఖ్యమంత్రి రేఖ గుప్తాపై జరిగిన దాడిని ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు- లేదని అతిషి అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాపై జరిగిన దాడి అత్యంత ఖండించదగినది. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు, నిరసనలకు చోటు ఉంటుంది. కానీ హింసకు చోటు లేదు. నిందితులపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము.

# ఢిల్లీ సిఎంపై దాడి కేసు

**• రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తింపు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్20:** దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఓ వ్యక్తి దాడి చేయడం సంచలనం రేపింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జి భాయ్ సకారియాగా (41) గుర్తించారు. గుజరాత్‌లోనూ అతడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు దాడికి గల కారణాలు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఈసందర్భంగా అతడి కుటుంబసభ్యులను విచారిస్తున్నారు. ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేసేందుకు ముఖ్యమంత్రి అధికారిక నివాసానికి వచ్చినట్లు- వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, వీటిని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది.మరోవైపు గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, ఆమె నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కుమారుడు దిల్లీ సీఎంను కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లు- సమాచారం. అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని పేర్కొన్నట్లు- తెలుస్తోంది. అయితే, అతడి మానసిక పరిస్థితి బాగా లేదని, గతంలోనూ ఓసారి దిల్లీకి వెళ్లి వచ్చాడని పోలీసులకు వివరించినట్లు సమాచారం. ఇదిలాఉంటే, దిల్లీ సివిల్ లైన్స్‌లోని సీఎం అధికారిక నివాసంలో బుధవారం ఉదయం 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై రాజ్‌కోట్ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు.

# రోకో లేకుండానే భారత జట్టు 17 ఏళ్లలో ఇదే తొలిసారి 2008 నుంచి ఇప్పటి వరకు టీమ్ ఇదే



ఆసియా కప్ టోర్నీ వచ్చే నెలలో మొదలుకానున్నది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు టీ20 ఫార్మాట్‌లో జరుగనుండగా.. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే హైవోల్టేజ్ మ్యాచ్ కోసం నిరీక్షిస్తున్నారు. టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ సెప్టెంబర్ 14న దుబాయ్‌లో జరగనుంది. అయితే, భారత జట్టు ఈ మ్యాచ్ ఆడుతుందో.. లేదో ఇంకా స్పష్టత రాలేదు. అదే సమయంలో, సెప్టెంబర్ 10న యుఏఈతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. 2008 తర్వాత భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేరు లేకపోవడం ఇదే మొదటిసారి. 17 సంవత్సరాల తర్వాత వారిద్దరు లేకుండానే జట్టు ఈ టోర్నమెంట్ ఆడనుంది. 2008 నుంచి ఇప్పటి వరకు భారత జట్టు ఎంతగా మారిపోయిందో ఓ లుక్కేద్దాం రండి..!2008లో కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. రోహిత్‌కు ఇదే తొలి ఆసియా కప్. 2008లో ఆడిన ఆసియా కప్‌లో మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్‌గా ఉన్నాడు. ఇది రోహిత్ శర్మకు తొలి ఆసియా కప్. ఆ ఎడిషన్‌లో విరాట్ జట్టులో లేడు. యువరాజ్ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆ ఎడిషన్‌లో, టీమ్ ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. అయితే, శ్రీలంక చేతిలో 100 పరుగుల తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. 2010లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌కు కూడా ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ ఆ ఎడిషన్‌లో జట్టులో ఉన్నారు. అయితే, జట్టుకు ఎవరినీ వైస్ కెప్టెన్‌గా నియమించలేదు.ఆసియా కప్‌కు కూడా ధోనీ కెప్టెన్‌గా 2010లో ఫైనల్‌లో శ్రీలంకను 81 పరుగుల తేడాతో ఓడించి భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. 2012లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌లో ధోనీ కెప్టెన్‌గా ఉన్నాడు. విరాట్ కోహ్లీకి వైస్ కెప్టెన్సీ బాధ్యత అప్పగించారు. రోహిత్ శర్మ కూడా జట్టులో ఉన్నాడు. 2012లో సెమీ-ఫైనల్స్‌లో ఓడిపోవడంతో భారత జట్టు ఎలిమినేట్ అయ్యింది. ఫైనల్‌లో బంగ్లాదేశ్‌ను రెండు పరుగుల తేడాతో ఓడించి పాక్ టైటిల్ గెలిచింది. 2014లో కెప్టెన్ విరాట్ కోహ్లీ. 2014లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌కు విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. వ్యక్తిగత కారణాలతో కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. రోహిత్ శర్మ కూడా ఆ జట్టులో ఉన్నాడు. 2014లో కూడా భారత జట్టు సెమీఫైనల్స్ లో ఓడిపోయింది. ఆ తర్వాత ఫైనల్లో శ్రీలంక పాకిస్తాన్ ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ గెలుచుకుంది. 2016లో ఆసియా కప్ ను తొలిసారి టీ20 ఫార్మాట్ లో నిర్వహించారు. కెప్టెన్‌గా ధోనీ చివరి ఆసియా కప్ ఇది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరూ జట్టులో ఉన్నారు. భారత జట్టు ఛాంపియన్ గా నిలిచింది. ఫైనల్ లో బంగ్లాదేశ్ ను ఎనిమిది వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ గెలుచుకుంది. 2017 ప్రారంభంలో పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్సీ నుంచి ధోనీ వైదొలిగిన తర్వాత విరాట్ కెప్టెన్ అయ్యాడు. అయితే, 2018 ఆసియా కప్‌కు ముందు ఏదో కారణం చేత తన పేరును ఉపసంహరించుకున్నాడు. ఈ పరిస్థితుల్లో రోహిత్ కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్ గా నియమితుడయ్యాడు. ఆ జట్టులో ధోనీ వికెట్ కీపర్‌గా ఉన్నాడు. వన్డే ఫార్మాట్ లో ఆడిన ఆ ఎడిషన్ ను భారత్ గెలుచుకుంది. ఫైనల్‌లో రోహిత్ నేతృత్వంలోని జట్టు బంగ్లాదేశ్ ను మూడు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ గెలుచుకుంది.

# రూ.4.20 లక్షల కోట్లు 50 అమెరికా సుంకాలతో ప్రభావితమయ్యే భారతీయ ఎగుమతులు



పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్రం.. ముదురుతున్న ట్రేడ్ వార్అమెరికాలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు దేశీయ ఎగుమతుల్ని గట్టిగానే ప్రభావితం చేయనున్నాయి. మంగళవారం లోక్‌సభలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జతిన్ ప్రసాద్ ఓ ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంతో టారిఫ్‌ల దెబ్బకు ఏర్పడే ప్రభావం లక్షల కోట్ల రూపాయల్లోనే ఉంటుందని స్పష్టమైంది. 2024 ట్రేడ్ వాల్యూ ఆధారంగా దేశీయ వాణిజ్య ఎగుమతుల్లో దాదాపు 48.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.20 లక్షల కోట్లు) విలువైనవి ఇబ్బందుల్లో పడవచ్చన్నది అంచనా. కాగా, అమెరికాతో ట్రేడ్ డీల్‌ను ఆలస్యం చేస్తున్నందుకు 25 శాతం, రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను కొంటున్నందుకుగాను జరిమానాగా మరో 25 శాతం సుంకాలను భారత్‌పై ట్రంప్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే ఇందులో సగం (25 శాతం) ఈ నెల 7 నుంచే అమల్లోకి రాగా, మిగతా సగం (25 శాతం) ఈ నెల 27 నుంచి వర్తించనున్నాయి. ఇదే జరిగితే 50 శాతం సుంకాలను భారత్ ఎదుర్కోవాల్సి వస్తుంది.వాణిజ్య చర్చల్లో ప్రతిష్ఠంభన అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జరుగుతున్న చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొన్నదా? అంటే అవుననేట్టుగానే ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. 6వ విడుత చర్చల్లో భాగంగా ఈ నెల 25న అమెరికా ప్రతినిధులు భారత్‌లో పర్యటించాల్సి ఉన్నది. అయితే ఈ టూర్ రద్దయింది. మళ్లీ ఎప్పుడు జరుగుతుందన్నదానిపై ఇంకా ఎటువంటి స్పష్టతా లేకుండాపోయింది. దీంతో ఇరు దేశాల మధ్య ట్రేడ్ వార్ మరింత ముదురుతుందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయిప్పుడు. ఇప్పటికే రష్యాతో క్రూడాయిల్ లావాదేవీలను భారత్ భారీగా జరుపుతోందని గుర్రుగా ఉన్న ట్రంప్.. 25 శాతం టారిఫ్‌లను వేసిన సంగతి విదితమే. ఇక అంతకుముందు విధించిన 25 శాతం సుంకాలపై భారత్ పెదవి విరుస్తున్నది. వాణిజ్య చర్చలు జరుగుతుండగానే.. ప్రతీకార సుంకాలకు దిగడం సరికాదంటున్నది. మొత్తానికి మరో వారం రోజుల్లో ఇంకో 25 శాతం టారిఫ్‌లు పడుతుండగా.. ఇప్పుడీ చర్చలు రద్దు కావడం మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. దీంతో ఇప్పట్లో భారత్‌కు టారిఫ్‌ల నుంచి ఊరట దక్కకపోవచ్చు.రోజూ 1.8 మిలియన్ బ్యారెళ్లు అమెరికా ఒత్తిళ్లను పక్కనబెట్టిన భారత్.. రష్యా నుంచి ముడి చమురును భారీగానే కొన్నది. ఈ నెల ప్రథమార్ధంలో రోజుకు 1.8 మిలియన్ బ్యారెళ్ల చొప్పున దిగుమతి చేసుకున్నది. జూలైలో 1.6 మిలియన్ బ్యారెళ్లుగానే ఉండటం గమనార్హం. దీనిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. రష్యా చమురు చౌకగా దొరుకుతున్నదని, అందుకే దేశ ప్రయోజనాల దృష్ట్యా మరింతగా కొంటున్నామని వెల్లడించాయి. అయితే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపాలంటూ అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ జరిపిన చర్చలు విఫలమైన నేపథ్యంలో భారత్‌పై మరిన్ని సుంకాలుంటాయన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే మోదీ సర్కారు ఎలా ప్రతిస్పందిస్తుందోనన్నది ఇప్పుడు కీలకంగా మారుతున్నది.ఫార్మాకూ కష్టాలే: ఫిచ్ఈ నెల 27 నుంచి భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాలు మరో 25 శాతం పెరగనుండటంతో.. ఔషధ రంగానికీ ఇబ్బందులు తప్పేలా లేవని ప్రముఖ గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. ప్రస్తుతానికైతే దేశీయ ఫార్మాకు సుంకాల నుంచి మినహాయింపు లభిస్తున్నది. కానీ అమెరికా టారిఫ్‌లు 50 శాతానికి పెరిగితే సీన్ మారవచ్చని ఫిచ్ హెచ్చరిస్తుండటం గమనార్హం. అలాగే 50 శాతం సుంకాలు అమలైతే ఆసియా దేశాల్లో అత్యధికంగా అమెరికా టారిఫ్‌లను ఎదుర్కొంటున్న దేశం భారతే అవుతుందని కూడా ఓ ప్రకటనలో ఫిచ్ గుర్తుచేస్తున్నది. ఈ క్రమంలో 2025-26 దేశ వృద్ధి 6.5 శాతానికే పరిమితం కావచ్చన్నది. అంతేగాక భారతీయ కంపెనీల ఆదాయం, లాభాలు కూడా ప్రభావితం కావచ్చని చెప్పింది.

# మన సైన్యమిదే ఆసియా కప్ టోర్నీకి జట్టు ఎంపిక




రెండు ప్రతిష్టాత్మక టోర్నీల కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమయ్యాయి. యూఈఏ వేదికగా ఆసియా కప్ టోర్నీకి సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో టీమ్ఇండియాను ఎంపిక చేస్తే..స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచకప్‌నకు హర్మన్‌ప్రీత్‌కౌర్ కెప్టెన్సీలో అమ్మాయిల జట్టు బరిలోకి దిగనుంది. ముంబైలో మంగళవారం గంటల వ్యవధిలో సమావేశమైన సెలెక్షన్ కమిటీలు రెండు వేర్వేరు జట్లను ప్రకటించాయి. ఊహించినట్లుగానే శుభ్‌మన్‌గిల్‌కు వైస్ కెప్టెన్సీగా దక్కగా, శ్రేయాస్ అయ్యర్‌కు చుక్కెదురైంది. బుమ్రాకు బెర్తు దక్కగా, సిరాజ్ టీ20 టీమ్ టికెట్ మిస్సయ్యింది. కౌర్ కెప్టెన్సీలో భారత జట్టుకు హైదరాబాదీ అరుంధతిరెడ్డి, ఆంధ్ర స్పిన్నర్ శ్రీచరణి ఎంపిక కాగా, హార్డ్‌హిట్టర్ షెఫాలీవర్మకు మొండిచేయి ఎదురైంది. ఒకే రోజు రెండు వేర్వేరు జట్లు ప్రకటించగా, కొందరికి అదృష్టం కలిసిరాగా, మరికొందరిని దురదృష్టం వెంటాడింది.ముంబై: యూఏఈ వేదికగా జరిగే ఆసియా కప్ టోర్నీ కోసం టీమ్ఇండియాను ప్రకటించారు. మంగళవారం బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో భేటీ అయిన అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలెక్షన్ కమిటీ 15 మందితో కూడిన భారత జట్టును ఎంపిక చేసింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా కొనసాగనుండగా, అందరూ ఊహించినట్లు గానే యంగ్ అండ్ డైనమిక్ శుభ్‌మన్‌గిల్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. మొత్తంగా గత కొన్ని రోజుల నుంచి జట్టు ఎంపికపై కొనసాగుతున్న సందిగ్ధతకు సెలెక్టర్లు ఫుల్‌స్టాప్ పెట్టారు. సెప్టెంబర్ 9 నుంచి మొదలయ్యే ఆసియాకప్‌లో భారత్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నది.చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్, ఒమన్, యూఏఈతో కలిసి భారత్ గ్రూపు-'ఏ'లో బరిలోకి దిగుతున్నది. వచ్చే ఏడాది స్వదేశంలో జరుగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టును ఎంపిక చేసినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించడంపై బీసీసీఐ ఆలోచన ఏంటో స్పష్టంగా కనిపిస్తున్నది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గిల్‌ను ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా కొనసాగించేందుకు బీసీసీఐ పావులు కదుపుతున్నది. ఐపీఎల్‌తో యువ క్రికెటర్లు అంచనాలకు మించి రాణిస్తున్న వేళ జట్టు ఎంపిక సెలెక్టర్లకు ఒక రకంగా కత్తిమీద సాములా మారింది.గిల్‌కు లక్, అయ్యర్‌కు ఝలక్!ఇటీవలి అండర్సన్-టెండూల్కర్ సిరీస్ గిల్ జాతకాన్ని మార్చేసింది. ఇంగ్లండ్ పేస్ పిచ్‌లపై అంచనాలకు మించి రాణించిన గిల్ విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. ఈ సిరీస్‌కు ముందు కనీసం అర్ధసెంచరీ లేని చోట గిల్ ఏకంగా డబుల్ సెంచరీ సహా నాలుగు సెంచరీలతో టోర్నీ టాపర్‌గా నిలిచాడు. దీనికి తోడు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేయడంలో కెప్టెన్‌గాను విజయవంతమయ్యాడు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున సెలెక్టర్లు అక్షర్‌పటేల్‌ను తప్పిస్తూ తిరిగి గిల్‌కే వైస్ కెప్టెన్సీ పగ్గాలు అందించారు. గిల్ చేరికతో టాపార్డర్‌లో తీవ్ర పోటీ నెలకొన్నది.

# హెచ్‌డీఎఫ్‌సీ కస్టమర్లకు ఓ గుడ్‌న్యూస్





మీరు బ్యాంక్ కస్టమర్ అయితే మీకు ఒక ముఖ్యమైన వార్త ఉంది. ఆగస్టు 22 రాత్రి 11 గంటల నుండి ఆగస్టు 23 ఉదయం 6 గంటల వరకు దాదాపు ఏడు గంటల పాటు బ్యాంక్ కొన్ని సేవలను నిలిపివేస్తుంది. రాబోయే కాలంలో సేవలు మెరుగ్గా, వేగంగా ఉండేలా వ్యవస్థ నిర్వహణ కోసం ఈ పని జరుగుతోందని బ్యాంక్ తెలిపింది. ఈ సమయంలో ముఖ్యంగా చాట్ బ్యాంకింగ్,లలో అందుబాటులో ఉన్న కొన్ని కస్టమర్ సపోర్ట్ సేవలు మూలిచిపోనున్నాయి. అందువల్ల ఈ సమయంలో మీకు ఏదైనా ముఖ్యమైన పని ఉంటే ముందుగా దాన్ని పూర్తి చేయండి. ఎందుకంటే ఈ గంటల్లో ఈ సేవలు అందుబాటులో ఉండవు.ఏ సేవలు నిలిచిపోతాయి:ఈ సమయంలో మీరు ఫోన్ బ్యాంకింగ్ ఆటోమేటిక్ వ్యవస్థను ఉపయోగించలేరు. అలాగే ఇమెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా బ్యాంకు నుండి సహాయం పొందడం కష్టం అవుతుంది. ఈ సమయంలో లో చాట్ బ్యాంకింగ్,బ్యాంకింగ్ సౌకర్యాలు కూడా పనిచేయవు. ఈ సేవలన్నీ ఆగస్టు 22 రాత్రి 11 గంటల నుండి ఆగస్టు 23 ఉదయం 6 గంటల వరకు మూసివేయబడతాయి.అయితే కొన్ని సేవలు పూర్తిగా పనిచేస్తూనే ఉంటాయి. మీరు ఫోన్ బ్యాంకింగ్ ఏజెంట్‌ను సంప్రదించవచ్చు. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ యాప్ ద్వారా మీ లావాదేవీలు చేయవచ్చు. దీనితో పాటువంటి సౌకర్యాలు కూడా ఈ సమయంలో పనిచేస్తూనే ఉంటాయి. వీటితో మీరు ఎటువంటి అంతరాయం లేకుండా పని చేయగలుగుతారు.ఈ నిర్వహణ ఎందుకు జరుగుతోంది బ్యాంక్ ఎల్లప్పుడూ తన సాంకేతిక వ్యవస్థను మెరుగ్గా, సురక్షితంగా చేయడానికి ప్రయత్నిస్తుంది. దీని కోసం వ్యవస్థ నిర్వహణ ఎప్పటికప్పుడు అవసరం.బ్యాంక్ ఈ పనిలో భాగంగా తన డిజిటల్, ఇతర వ్యవస్థలను శుభ్రపరచడం, మెరుగుపరచడం కూడా చేస్తోంది. ఇది కొత్తేమీ కాదు, బదులుగా మీరు భవిష్యత్తులో మెరుగైన, అంతరాయం లేని సేవలను పొందగలిగేలా బ్యాంక్ ఇటువంటి నిర్వహణ పనులను క్రమం తప్పకుండా చేస్తూనే ఉంటుంది.ముఖ్యమైన పనిని ముందుగానే పూర్తి చేసుకోండి:పైన పేర్కొన్న క్లోజ్డ్ సేవలకు సంబంధించిన ఏదైనా ముఖ్యమైన బ్యాంకింగ్ సేవ మీకు ఉంటే ఆగస్టు 22 రాత్రి 11 గంటలలోపు దాన్ని పూర్తి చేయండి. తరువాత ఈ సేవలు దాదాపు 7 గంటల పాటు అందుబాటులో ఉండవు. అలాగే మీరు సమస్యలను ఎదుర్కోవచ్చు. కస్టమర్లు ముందుగానే సిద్ధం కావడానికి బ్యాంక్ ఈ సమాచారాన్ని సకాలంలో అందించింది. నిర్వహణ ముగిసిన వెంటనే బ్యాంక్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం ప్రారంభిస్తుంది. ఇప్పుడు బ్యాంకు తన కస్టమర్లకు శుభవార్త అందించింది. అదే బోనస్ ప్రకటన. బ్యాంక్ 1:1 బోనస్ ఇష్యూ రికార్డు తేదీ దగ్గర పడుతుండటంతో షేరు ధర మరోసారి రూ.2,000 దాటింది. ఈ మెగా బ్యాంక్ చరిత్రలో తొలిసారిగా లాభాలను ఆర్జించబోతోంది. అయితే మీరు %ఎణఖీజ% బ్యాంక్‌లో షేర్లు కొనుగోలు చేసినట్లయితే మీకు లాభం చేకూరనుంది. అది 58,315.45% ఆల్-టైమ్ లాభాలను ఇచ్చి, పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. ఆగస్టు 18న మార్కెట్ సమయం ముగిసిన తర్వాత %ఎణఖీజ% బ్యాంక్ షేరు ధర %దీూజు%లో రూ.2003.65 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాప్ రూ.15,37,788.89 కోట్లకు చేరుకుం ది. ఇది దాని 52 వారాల గరిష్ట స్థాయి రూ.2,036.30కి దగ్గరగా ఉంది.రూ. 20,000 పెట్టుబడి రూ. 1.16 కోట్లుగా మారింది:ఉదాహరణకు, ఒక పెట్టుబడిదారుడు ఏప్రిల్ 5, 1996న రూ.20,000 విలువైన బ్యాంక్ షేర్లను కొనుగోలు చేసి ఉంటే 58,315.45% ఆల్-టైమ్ లాభాలతో వారి పెట్టుబడి రూ.1,16,83,090 లేదా రూ.1.16 కోట్ల కార్పస్‌కు పెరిగి ఉండేది. 1:1 బోనస్ ఇష్యూకు రికార్డ్ తేదీ, ఎక్స్-బోనస్ తేదీ ఆగస్టు 26, 2025న నిర్ణయించింది.మీరు బ్యాంక్‌లో ఒక్కొక్కటి రూ. 2,000 చొప్పున 100 షేర్లను కలిగి ఉన్నారని అనుకుందాం. బోనస్ రికార్డ్ తేదీలో మార్కెట్ ప్రతిచర్య లేదని ఊహిస్తే, 1:1 బోనస్ ఇష్యూ నిష్పత్తిలో మీరు 100 ఉచిత షేర్లను (100 ఇప్పటికే ఉన్న షేర్లు %ఇ% 1/1) అందుకుంటారు. ఇది మీ మొత్తం షేర్ల సంఖ్యను 200 షేర్లకు తీసుకువెళుతుంది. కానీ షేర్ ధర విలువ ఒక్కొక్కటి రూ. 1,000కి తగ్గించబడుతుంది. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో ఎటువంటి పెరుగుదల లేదా పతనం ఉండదు. మీ సంపద అలాగే ఉంటుంది.

# త్వరలో హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్




హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్(హెచ్‌పీఎల్)కు వేళయైంది. సెంటర్ కోర్ట్ స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌ను రూపొందించింది. అక్టోబర్ 10వ తేదీన ప్రారంభమై..ప్రతీ శుక్రవారం అభిమానులను అలరించనుంది. ఐపీఎల్ తరహాలో ఫ్రాంచైజీల వారీగా జరుగనున్న లీగ్ కోసం ఈనెల 20న ప్లేయర్ల వేలం జరుగనుంది. గ్రామీణ ప్లేయర్లకు కూడా అవకాశం కల్పిస్తూ ఉన్నత స్థాయి వినోదాన్ని అందించాలనే లక్ష్యంతో లీగ్‌కు రూపకల్పన చేశారు. మొత్తం 12 లక్షల ప్రైజ్‌మనీతో జరుగనున్న లీగ్‌లో ఎనిమిది జట్లు పోటీపడనున్నాయి. ఒక్కో జట్టులో 10 మంది ప్లేయర్లు ఉంటారు. ప్రతీ జట్టుకు ఒక ఐకాన్ ప్లేయర్ కెప్టెన్సీ వహిస్తాడు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగనున్న టోర్నీలో మ్యాచ్‌లు ఎనిమిది వేదికల్లో జరుగుతాయి.

# దిగొస్తున్న పుత్తడి



: బంగారం మరింత దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు దిగొస్తున్నాయి. ఢిల్లీలో తులం రూ.500 తగ్గి రూ.1,00,420గా నమోదైంది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర కూడా రూ.450 తగ్గి రూ.1,00,050 గా నమోదైంది. అమెరికా-ఉక్రెయిన్ దేశాల అధినేతల మధ్య చర్చలు జరుగుతుండటం వల్లనే పసిడి ధరలు దిగొచ్చాయని బులియన్ విశ్లేషకులు వెల్లడించారు.వెండి ధరలు బాగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో రూ. 1,000 తగ్గి రూ.1.14 లక్షలుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,337.92 డాలర్లు, వెండి 38.09 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

## సెమీస్‌లో స్వియటెక్ జోడీయూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిపలో స్వియటెక్, డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జంటలు సెమీస్ చేరుకొన్నాయి. క్వార్టర్స్‌లో స్వియటెక్ -కాస్పర్ రూడ్ ద్వయం 4-1, 4-2తో కేటీ మెక్‌నెల్లీ-ముసెట్టి జంటపై గెలిచింది. తొలిరౌండ్‌లో కీన్-టియాఫోపై స్వియటెక్ జోడీ గెలిచింది. క్వార్టర్స్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-1, 5-4(4)తో ముచోవా-రుబ్లేవ్‌పై నెగ్గింది. మొదటి రౌండ్‌లో రిబకినా-ఫ్రిట్జ్‌పై 4-2, 4-2తో ఎరాని జంట నెగ్గింది. కాగా, వీనస్ విలియమ్స్-రిల్లీ ఒపెల్కా 2-4, 4-5(2)తో ముచోవా-రుబ్లేవ్ ద్వయం చేతిలో, ఒసాక-మోన్‌ఫిల్స్ జోడీ 3-5, 2-4తో కేటీ-ముసెట్టి జంట చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడారు.

# 40ఏండ్ల తర్వాత

రెండు సింహాలు తలపడితే చూడ్డానికి భలే ఉంటుంది. ఆ పోరాటంలో ఏ గెలుపూ మనకు ఆనందాన్నివ్వదు. కేవలం ఆ ఫైటే కావాల్సినంత కిక్కిస్తుంది. ఇలాంటి ఓ యుద్ధానికి వెండితెర సిద్ధమవుతున్నట్టు ఓ వార్త మీడియా సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించబోతున్నారు. దశాబ్దాల తర్వాత ఈ రెండు సింహాలు వెండితెర వేదికగా తలపడనున్నాయి. ఈ ఇద్దరినీ ఒకే కథలో భాగం చేసే సాహసం చేసిన దర్శకుడెవరో కాదు.. లోకేష్ కనకరాజ్. 'కూలీ'తో రజనీకాంత్‌కు భారీ విజయాన్ని కట్టబెట్టిన లోకేష్.. ఇప్పుడు తలైవాకు లోకనాయకుడ్ని జత చేసి, రికార్డుల వేటకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.నిజానికి రజనీకాంత్ కెరీర్ మొదలైందే కమల్‌హాసన్‌తో. రజనీ తొలి సినిమా 'అపూర్వరాగంగళ్'లో హీరో కమల్‌హాసనే. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి దాదాపు ఓ డజన్ సినిమాల్లో నటించారు. తమిళనాట ప్రాణస్నేహితులుగా పేరు గడించారు. బాలీవుడ్‌లో అమితాబ్ హీరోగా



రూపొందిన 'గిరఫ్తార్'(1985) సినిమాలో వారిద్దరూ చివరిసారిగా కలిసి నటించారు. వినిపిస్తున్న వార్త నిజమైతే.. 40ఏండ్ల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు ఈ సింహాలు తలపడనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులందరికీ ఇది నిజంగా శుభవార్తే.

# కార్మిక సంఘాలతో ఛాంబర్ భేటీ

నిర్మాతలతో మాట్లాడి నిర్ణయం చెబుతామన్న ఛాంబర్‌తుది నిర్ణయంపై ఆశాభావంతో కార్మికసంఘాలు కార్మికుల సమ్మె కారణంగా గత పదహారు రోజులుగా సినిమా షూటింగులు నిలిచిపోయిన విషయం విదితమే. ప్రముఖ నటుడు చిరంజీవితో సోమవారం ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు భేటీ కావడం, అదేరోజున ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్‌తో నిర్మాతలు సమావేశమవ్వడం.. ఈ రెండు సమావేశాలూ మంగళవారం జరుగనున్న చర్చలపై ఆసక్తిని పెంచాయి. నిజానికి మంగళవారం చిరంజీవితో ఇరు వర్గాల భేటీ మరోసారి ఉంటుందని ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని ప్రకటించారు. అయితే.. మంగళవారం చిరంజీవితో ఎలాంటి చర్చలూ జరుగలేదు. ఫిల్మ్‌ఛాంబర్‌తో ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యుల సమావేశం మాత్రం సుదీర్ఘంగా జరిగింది. కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ వీరశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో.. 24 శాఖలకు సంబంధించిన 13 యూనియన్లతో విడివిడిగా ఛాంబర్ చర్చించింది.సమావేశం అనంతరం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని మీడియాతో మాట్లాడారు. 'నిర్మాతలు మా ముందుంచిన వర్కింగ్ కండీషన్ల గురించి సుదీర్ఘ చర్చ జరిగింది. మా అభిప్రాయాలను



క్లియర్‌గా ఫిల్మ్‌ఛాంబర్‌కి వినిపించాం. ఉదయం నిర్మాతలతో కూడా మాట్లాడి, సాయంత్రం 4 గంటలకు అందరికీ ఆమోదయోగ్యమయ్యే ఓ మంచిమాట చెబుతామని ఛాంబర్ సభ్యులు తెలియజేశారు. వేతానాల పెంపు విషయంలోనూ ఛాంబర్ సానుకూలంగానే స్పందించింది. వేతనాలు పెంచేందుకు నిర్మాతలు మినహాయించిన మూడు యూనియన్లకు కూడా వేతనాలు పెంచేందుకు ఛాంబర్ అంగీకరించింది. అయితే.. ఎంత శాతం పెంచేది రేపు తెలుస్తుంది. చిరంజీవి గారితో ఫోన్లో మాట్లాడి అన్ని విషయాలనూ వివరించాం. బుధవారం ఫిల్మ్‌ఛాంబర్ నుంచి మంచి కబురును ఆశిస్తున్నాం.' అన్నారు.

# నా కల నిజమైంది

కన్నడ సొగసరి రుక్మిణి వసంత్‌కు కెరీర్‌లో బ్రేక్ రావడానికి కాస్త సమయం పట్టింది. అయితే రెండేళ్ల క్రితం వచ్చిన కన్నడ చిత్రం 'సప్తసాగరాలు దాటి' ఆమె సినీ ప్రయాణాన్ని పూర్తిగా మలుపు తిప్పింది. ఈ చిత్రంలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. దాంతో వరుస అవకాశాలు వెల్లువెత్తాయి. ఇప్పుడీ భామ చేతిలో ఉన్నవన్నీ భారీ చిత్రాలే. 'కాంతార చాప్టర్-1'లో ఈ భామ కనకావతి అనే పాత్రను పోషిస్తున్నది. ఇటీవలే ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. తాజా ఇంటర్వ్యూలో 'కాంతార చాప్టర్-1' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రుక్మిణి వసంత్.చిత్ర హీరో, దర్శకుడు రిషబ్‌శెట్టి సినిమా కోసం తనను సంప్రదించినప్పుడు ఆనందానికి అవధులు లేకుండా పోయానని, తన కల నిజమైందనే భావన కలిగిందని రుక్మిణి వసంత్ పేర్కొంది. "కాంతార చాప్టర్-1' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. చిత్రబృందం కోరిక మేరకు సినిమాలో నేను నటిస్తున్న విషయం కానీ, నా పాత్ర గురించి కానీ ఎక్కడా మాట్లాడలేదు. ఆ విషయాన్ని ఓ రహస్యంగా దాచి ఉంచాను. కొద్ది రోజుల క్రితమే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో నా పాత్ర గురించి అందరికీ తెలిసింది' అని రుక్మిణి వసంత్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నది. తమిళంలో 'మదరాసి', కన్నడంలో యష్ 'టాక్సిక్'లో నాయికగా నటిస్తున్నది.



# మిరాయ్ వాయిదా

ఈ మధ్య టాలీవుడ్ లో ప్రతి సినిమా వాయిదాల మీద వాయిదాలు పడుతూ రిలీజ్ అవుతున్నాయి. అసలు అనుకున్న టైమ్ కు వచ్చే సినిమాలు చాలా తక్కువ అని చెప్పొచ్చు. కొన్నేమో రిలీజ్ డేట్ లు లేక.. ఇంకొన్ని వేరే సినిమాలతో పోటీ పడలేక.. మరికొన్ని విఎఫ్ఎక్స్ లు అవ్వక.. ఇలా రకరకాల రీజన్స్ తో సినిమాలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఒకప్పుడు ఒక్కసారి తమ సినిమా వాయిదా పడితే శుభ సూచకం కాదని భావించేవారు. కానీ, ఇప్పుడు ఇదొక ట్రెండింగ్ గా మారిపోయింది.తాజాగా తేజ సజ్జా హీరోగా నటించిన మిరాయ్ వాయిదా పడిందని వార్తలు వస్తున్నాయి. హనుమాన్ లాంటి భారీ విజయం తరువాత తేజ నటిస్తున్న చిత్రం మిరాయ్. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఇక ఈ చిత్రంలో తేజ సజ్జా సరసన రితికా నాయక్ నటిస్తుండగా.. మంచు మనోజ్ విల న గా నటిస్తున్నాడు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ సినిమా సెప్టెంబర్ 5 న రిలీజ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అందుకు తగ్గట్లుగానే సినిమా ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టేశాడు తేజ.ఇప్పటికే మిరాయ్ నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు హైప్ కూడా క్రియేట్ చేసింది. ఇక ఇంకో నెలలో రిలీజ్ పెట్టుకొని ప్రమోషన్స్ మొదలుపెట్టకపోవడంతో అభిమానుల్లో కొద్దిగా అనుమానం మొదలయ్యింది. అయితే అందుతున్న సమాచారం ఈసారి కూడా మిరాయ్ వాయిదా పడిందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వాయిదాకు కారణం ఏంటి అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. అయితే సెప్టెంబర్ 5 న వస్తుంది.. లేకపోతే మాత్రం సెప్టెంబర్ 12 న రిలీజ్




చేయనున్నారని సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది.సెప్టెంబర్ 12 అంటే ఇప్పటికే దుల్కర్ సల్మాన్ కాంత, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కిష్కింధపురి రిలీజ్ కు రెడీ అవుతున్నాయి. ఇక ఈ రెండు సినిమాలతో పోటీగా మిరాయ్ దిగుతుంది. మూడు.. మూడు డిఫరెంట్ కాన్సెప్ట్స్. కానీ, మిరాయ్ పెద్ద సినిమాగా రిలీజ్ కానుంది. ఆ రోజు సినిమా వస్తే బెల్లంకొండ వెనక్కి తగ్గుతాడేమో అనిపిస్తుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముందో అనేది తెలియాలంటే మేకర్స్ అధికారికంగా ప్రకటించేవరకు ఆగాల్సిందే.

# ఆ ఒక్క కారణంతో హాలీవుడ్ సినిమాను రిజెక్ట్ చేసిన పుష్ప విలన్.

మలయాళ సినిమా ఇండస్ట్రీలో స్టార నటుడిగా కొనసాగుతున్నాడు ఫహాద్ ఫాజిల్. అయితేనేం ఈ నటుడికి పాన్ ఇండియా క్రేజ్ ఉంది. ఓవైపు హీరోగా నటిస్తూనే మరోవైపు విలన్, కమెడియన్, సహాయక నటుడి పాత్రల్లో నటిస్తూ దేశ వ్యాప్తంగా పాపులారిటీ సొంతం చేసుకున్నాడు.ఫహాద్ ఫాజిల్ క్రేజ్ ఏ స్థాయికి చేరిందో, ఆస్కార్ విన్నింగ్ ఫిల్మ్ డైరెక్టర్ తన సినిమాలో నటించమని ఫహద్‌ని కోరాడు, కానీ ఈ పుష్ప విలన్ మాత్రం నో చెప్పాడు. 'టైటానిక్' హీరో లియోనార్డో డికాప్రియోకు తొలి ఆస్కార్‌ను తెచ్చిపెట్టిన 'ది రెవెనెంట్' చిత్రానికి తెరకెక్కించిన అలెజాండ్రో గొంజాలెజ్ ఇనారిటు తెలుగు ఆడియెన్స్ కు కూడా పరిచయమే. 'బర్డ్‌మ్యాన్', 'ది రెవెనెంట్' తో పాటు హాలీవుడ్ లో అద్భుతమైన చిత్రాలకు అలెజాండ్రో గొంజాలెజ్ ఇన్నార్టో దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన ఒక కొత్త సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో ఫహద్ ను ఒక పాత్రలో నటించమని అలెజాండ్రో అడిగారు. కానీ ఫహద్ ఫాసిల్ మాత్రం నో చెప్పాడు.దర్శకుడు అలెజాండ్రో



గొంజాలెజ్ ఇన్నార్టో స్వయంగా ఫహద్‌ను ఈ చిత్రంలో ఒక నిర్దిష్ట పాత్ర పోషించమని కోరారు. వారు వీడియో కాల్‌లో కూడా ఆ పాత్ర గురించి చర్చించారు. కానీ అన్ని చర్చల తర్వాత, ఫహద్ నో అన్నారు. దీని గురించి ఒక ఇంటర్వ్యూలో ఫహద్ ఫాసిల్ మాట్లాడుతూ, "మేము వీడియో కాల్‌లో మాట్లాడుకున్నాము. కానీ ఆ సినిమాలో నటించడానికి నా యాస సమస్యగా మారింది. దాన్ని సరిచేయడానికి శిక్షణ కోసం నేను న్యూయార్క్, అమెరికాలో నాలుగు నెలలు గడపవలసి ఉంటుందని వారు చెప్పారు. కానీ ఆ కాలానికి నాకు ఎటువంటి పారితోషికం ఇవ్వబోమని చెప్పారు. కాబట్టి నేను ఆ సినిమాలో నటించలేదు. మరొక విషయం ఏంటంటే, కమర్షియల్ కోణం నుంచి చూస్తే, ఆ పాత్రకు నేను సరిపోను. ఈ అవకాశం కోల్పోయినందుకు నేనేమీ బాధపడలేదు"' ఇలాంటి చర్చలు చాలా సినిమాలకు జరిగాయి. ఇలా సినిమా అవకాశాలను కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. నా జీవితంలో మ్యాజిక్ ఏదైనా జరిగిందంటే అది మలయాళంలోనే. ఇక్కడ సాధించిన విజయాలు నాకెంతో సంతృప్తిని చ్చాయి. భవిష్యత్తులో సినిమా రంగంలో ఏమైనా మార్పులు వస్తే అది మలయాళం నుంచే రావాలని కోరుకుంటున్నాను. అందు కోసం కేరళను వదిలి వెళ్లకూడదను కుంటున్నాను' అని ఫహద్ అన్నారు.

# నల్గొండ నాగులయ్య స్ఫూర్తితో

అమెరికాలో మాది సాఫ్ట్‌వేర్ కంపెనీ. క్రియేటివ్ వర్క్ చేస్తుంటాం. ఆ క్రియేటివిటీ మీద ఇష్టమే మమ్మల్ని సినిమాల వైపు నడిపించింది. క్రియేటివ్‌గా ఏదైనా కొత్తగా చేస్తున్నప్పుడు ఆ ఆనందం వేరుగా ఉంటుంది. కబడ్డీ నేపథ్యంలో ఇప్పటివరకూ కొన్ని కథలు వచ్చాయి. అయితే.. మా సినిమాలో చూపించినంత సీరియస్‌గా ఇప్పటి వరకూ ఏ సినిమాలో చూపించలేదు. కచ్చితంగా ఒక బెంచ్ మార్క్ మూవీ అవుతుంది.' అని నమ్మకం వ్యక్తం చేశారు నిర్మాత శ్రీని గుబ్బల. విజయ రామరాజు టైటిల్‌రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకుడు. ఈ నెల 29న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు నిర్మాత శ్రీని గుబ్బల.'హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు నల్గొండలో నాగులయ్య అనే అద్భుతమైన కబడ్డీ ప్లేయర్ ఉన్నాడు. అతడ్ని అర్జున్ అని కూడా పిలుస్తారు. అతని జీవితంలో జరిగిన యధార్థ సంఘటనలు 60 శాతం తీసుకొని, దానికి ఓ 40శాతం ఫిక్షన్ జోడించి ఈ కథ తయారు చేశాం. అవార్డు లొచ్చాయి. డైరెక్టర్ విక్రాంత్ పాషన్ ఉన్న మేకర్. సినిమాను అద్భుతంగా తీశాడు. అన్ని విధాలుగా సినిమా ఆకట్టుకుంటుంది.' అని తెలిపారు శ్రీని గుబ్బల.

# పొట్టి అంటూ ఏడిపించే వారు

లేటెస్ట్ సెన్సేషన్ ఇవానా.. ఈ ముద్దుగుమ్మ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలు పెట్టింది. ఆతర్వాత హీరోయిన్ గా మారింది. తమిళ్ లో లవ్ టుడే సినిమాతో పరిచయం అయ్యింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తెలుగులోనూ డబ్ అయ్యి మంచి హిట్ గా నిలిచింది. ఈ సినిమా తర్వాత ఇవానా రీసెంట్ గా సింగిల్ సినిమా చేసింది.శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా రీసెంట్ గా విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో ఇవానా తన అందంతో పాటు నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా సక్సెస్ ను ఎంజాయ్ చేస్తుంది ఇవానా. ఇక ఇప్పుడు ఈ చిన్నదానికి తెలుగులో క్రేజీ ఆఫర్స్ క్యూ కడుతున్నాయి. ఇదిలా ఉంటేగతంలో ఓ ఇంటర్వ్యూలో ఇవానా మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. చిన్నతనంలో హైట్ విషయంలో చాలా మంది ఏడిపించేవారు అని తెలిపింది. చిన్నప్పుడు నేను హైట్ తక్కువగా ఉండటంతో చాలా అవమానాలు, రిజక్షన్స్ ఎదుర్కొన్నా. స్కూల్‌లో నన్ను ఫ్రెండ్స్ 'పొట్టి' అని ఏడిపించేవారు అని తెలిపింది.వాళ్ల మాటలు చాలా బాధపెట్టేవి దాంతో నేను చదువు పై పెద్దగా దృష్టి పెట్టలేకపోయాను అని తెలిపింది. ఇక చిన్న వయసునుంచే సినిమాల పై ఇంట్రెస్ట్ ఉండేది అని చెప్పుకొచ్చింది. ఇవానాకు తెలుగులో 'హ్యాపీడేస్' అంటే చాలా ఇష్టమట. ఈ సినిమా సాంగ్స్ తన ఫేవరెట్



అని తెలిపింది అని చెప్పుకొచ్చింది.. అలాగే ఫేవరెట్ హీరో అల్లు అర్జున్.ఇక ఈ చిన్నదనికి ఇప్పుడు వరుసగా అవకాశాలు అందుకుంటుంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది తన ఫొటోలతో ఆకట్టుకుంటుందీ అందాల తార.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794